హైదరాబాద్ వార్త

ఫేక్ డాక్టర్లు... నకిలీ మందులు

-బస్తీలు, కాలనీల్లో యథేచ్ఛగా వైద్యం
-రోగం ఏదైనా యాంటీబయోటిక్స్ అందజేత
-మెడికల్ కౌన్సిల్, డ్రగ్ కంట్రోల్ దాడుల్లో వెలుగులోకి ..

హైదరాబాద్, మే 6,ప్రభాతవార్త:
ఇటీవల తీవ్ర అనారోగ్యంతో గాంధీలో చేరిన ఓమహిళకు వివిధ పరీక్షలు చేయగా మూత్ర పిండాలు వైఫల్యం చెందినట్లు వైద్యులు గుర్తించారు. వివిధ అనారోగ్య సమస్యల నుంచి ఎప్పటికప్పుడు ఉపశమనం పొందడానికి దీర్ఘకాలికంగా నొప్పి నివారణ మందులు వాడుతున్నట్లు తేలింది. స్థానికంగా ఉన్న వైద్యుడు అందించే ఈ వైద్యం... ఆమె కిడ్నీకు చేటు తెచ్చిందని తెలుస్తుంది. ఆమె మాత్రమే కాదు.. మూత్రపిండాల వైఫల్యంతో వస్తున్న వారిలో 10నుంచి 15 శాతం కేసులు ఈ తరహావే ఉంటున్నాయని వైద్యులు చెబుతున్నారు. నిపుణులైన వైద్యుల సూచనలు లేకుండా నొప్పి నివారణ, యాంటాసిడ్ మందులు వాడటం చాలా ప్రమాదకరమని సూచిస్తున్నారు. అరకొర జ్ఞానంతో సేవలు అందించే ఆర్ఎంపీలు, నకిలీ వైద్యుల ప్రభావం ఇప్పుడు నగరంపై కూడా పడుతోంది. తాజాగా సంఘటనలే ఇందుకు ఉదాహరణగా నిలుస్తున్నాయి.కొందరు ఎంబీబీఎస్ డిగ్రీలే కాదు..స్పెషలైజన్స్ డిగ్రీలు పెట్టుకొని దర్జాగా వైద్య సేవలు అందిస్తున్నారు. ముఖ్యంగా నగరంలోని చిన్న చిన్న బస్తీలు, గల్లీలు, కాలనీలే అడ్డాలుగా క్లినిక్‌లు తెరిచి ఇలాంటి వారు వైద్య సేవలు అందిస్తున్నారు.తొలుత చిన్న చిన్న సమస్యలకు ప్రాథమిక వైద్యం అందించి రోగుల్లో నమ్మకం కల్పిస్తున్నారు. పది రకాల మందుల గురించి తెలుసుకొని లక్షణాలు బట్టి అవే రోగులకు అందిస్తుంటారు. యాంటీ బయోటిక్స్, పెయిన్ కిల్లర్స్ లాంటి మందులతో తాత్కాలికంగా ఉపశమనం దొరుకుతుండటంతో చాలా మంది వీటినే ఆశ్రయిస్తున్నారు. అంతేకాక ఇక్కడ తక్కువ ఫీజు కూడా ఇందుకు ఒక కారణం. కొద్దిరోజుల క్రితమే మేడ్చల్ మేడిపల్లిలో రూప్ సింగ్ అనే నకిలీ డాక్టర్ తప్పుడు ఇంజెక్షన్లతో పి.ఎల్లో (56) మరణానికి కారణమై రిమాండ్‌కు గురయ్యాడు. అలాగే ఉప్పల్ పోలీస్ స్టేషన్ వరిధిలోని బీరప్పగడ్డలో అర్హత లేని నకిలీ డాక్టర్ బానో తు శ్రీనును ఏసీబీ ఉప్పల్ జోన్ టీమ్ అరెస్టు చేసింది. అంజలి ఫస్ట్ ఎయిడ్ క్లినిక్, మెడికల్ షాప్‌ను రిజిస్ట్రేషన్ లేకుండా నడుపుతూ డాక్టర్ సర్టిఫికెట్లు లేకుండా చికిత్సలు అందిస్తున్నాడని తేలింది.

బోర్డులో ఒకలిపేరు ... లోపల మరొకరు
నిబంధనల ప్రకారం ఆసుపత్రి పెట్టాలంటే కనీసం ఎంబీబీఎస్ ఉత్తీర్ణత పొంది ఉండాలి. ఎంబీబీఎస్ ధ్రువపత్రంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు దరఖాస్తు చేస్తే అన్నీ పరిశీలించిన తర్వాత మాత్రమే ఆసుపత్రికి అనుమతి ఇస్తుంది. అక్రమార్కులు నకిలీ ఎంబీబీఎస్ ధ్రువపత్రం సంపాదించి అధికారులను ఏమార్చి అనుమతి పొందుతున్నారు. మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి బోర్డు ఏర్పాటు చేసి ప్రముఖ వైద్యుల పేర్లు బోర్డు మీద రాయిస్తున్నారు. లోపలికి వెళ్తే ఆవైద్యులు కన్పించడంలేదు. స్థానిక ప్రైవేటు ప్రాక్టీషనర్స్ దర్శనం ఇస్తున్నారు. అయితే తమ పరిధిలోని ఆసుపత్రులను జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాల్సి ఉంది. వైద్యానికి సంబంధించిన అంశాలే కాకుండా, ఫీజులు ఇతరత్రా వ్యవహారాలన్నింటినీ ఓ కంట కనిపెట్టాలి. కానీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడం వల్లే ఆస్పత్రులను తరచూ తనిఖీలు చేయలేకపోతున్నామని కొన్ని జిల్లాల వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు.

రుజువైతే ఏడేళ్లు శిక్ష..
చాలామంది విదేశీ యూనివర్సిటీల్లో వైద్య విద్య పూర్తి చేసినట్లు పట్టాలు చూపుతున్నారు. ఆరా తీస్తుంటే అవన్నీ నకిలీ యూనివర్సిటీలే. కొందరైతే దొంగ డిగ్రీలు పుట్టిస్తున్నారు. నకిలీ డిగ్రీ అని తేలితే పోలీసులు 420 సెక్షన్ ప్రకారం కేసులు పెడుతున్నారు. దీనివల్ల ఏడేళ్లు శిక్ష పడే అవకాశం ఉంది. ఇక చికిత్స చేసి ఎవరి చావుకైనా కారణమైతే 302, 304(ఎ) సెక్షన్ల కింద కేసు పెడుతున్నారు. రుజువైతే ఏడేళ్లు అంతకంటే ఎక్కువ శిక్ష పడుతుంది.

ఉప్పల్ స్టేడియంలో సన్ రైజర్స్ హైదరాబాద్, పంజాబ్ కింగ్స్ మధ్య ఐపిఎల్ మ్యాచ్ సందడిగా జరిగింది. సినీ నటుడు వెంకటేష్ , క్రికెట్ అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

-దోమల నివారణకు పకడ్బందీ చర్యలు
- ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి

హైదరాబాద్, మే 6 ప్రభాతవార్త :
నగర పారిశుద్ధంపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నట్లు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి తెలిపారు. బుధవారం తార్నాకలోని ఎంఎంసి ప్రధాన కార్యాలయంలో ఉప్పల్ జోన్ పరిధిలోని శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్స్ (ఎస్ఎఫ్ఏలు)తో నిర్వహించిన ప్రత్యేక సమీక్ష సమావేశంలో ఆయన కీలక మార్గదర్శకాలు జారీ చేశారు.ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, అమలు చేయాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించిన కమిషనర్, శానిటేషన్ సిబ్బందిని ఇతర పనులకు వినియోగించరాదని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే జోనల్ కమిషనర్ అనుమతితో పనులు అప్పగించాలని తెలిపారు. రోడ్లపై చెత్త పేరుకుపోకుండా వెంటనే జీవీపీ పాయింట్లకు తరలించి, ప్రతి రోజు వాటిని పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సిబ్బంది హాజరు, ఇంటింటి చెత్త సేకరణ, స్వీపింగ్ పనులు క్రమబద్ధంగా అమలు కావాలని, ముఖ్యంగా స్వీపర్ల హాజరు శాతం పెంచి గైర్హాజరు సమస్యను తగ్గించేలా పర్యవేక్షణ కట్టుదిట్టం చేయాలని సూచించారు. అలాగే సాట్ వాహనాల ట్రిప్స్‌ను నమోదు చేస్తూ, సంబంధిత ఎస్‌సీటీపీలతో సమన్వయం కలిగి మానిటరింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు.ఇక వెక్టర్ కంట్రోల్ చర్యల్లో భాగంగా నగరంలోని సుమారు 20 ప్రాంతాల్లో దోమల నివారణ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. లార్వా పెరుగుదల కేంద్రాలను గుర్తించి యాంటీ లార్వల్ ఆపరేషన్స్ నిర్వహించడంతో పాటు, నాళాలు, చెరువులు, నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో ఆయిల్ బాల్స్, ఎంఎల్ ఆయిల్ వినియోగం ద్వారా నియంత్రణ చర్యలు చేపట్టారు. అదేవిధంగా డ్రోన్ సాయంతో స్ప్రేయింగ్, ఫాగింగ్ యంత్రాల ద్వారా కాలనీలు, బస్తీలు, ప్రధాన రహదారుల వెంట విస్తృతంగా ఫాగింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఇంకా 20 రోజుల అనంతరం జోనల్ వారీగా మళ్లీ సమీక్ష సమావేశం నిర్వహించి పనితీరును అంచనా వేస్తామని, అప్పటివరకు సూచించిన చర్యలను కచ్చితంగా అమలు చేసి పారిశుద్ధ్య సేవలను గణనీయంగా మెరుగుపరచాలని కమిషనర్ స్పష్టం చేశారు.

పారుశుద్ధ్య సిబ్బందికి సూచనలు చేస్తున్న వినయ్ కృష్ణారెడ్డి

పోకిరీల ఆట కట్టేందుకు...

-అర్ధరాత్రి వేళ " సిపి సుమతి" సీక్రెట్ ఆపరేషన్
-సాధారణ మహిళలా బస్టాండ్ వద్ద పడిగాపులు
-యువకుల నుంచి అసభ్యకరమైన వ్యాఖ్యలు
-3గంటలపాటు భరిస్తూ అక్కడే నిల్చున్న సిపి
-40మంది పోకిరీలను అదుపులోకి తీసుకున్న పోలీసులు
-వీరిలో హాస్టల్స్, డ్రగ్స్ తీసుకున్న విద్యార్థులే అధికం

హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త:
హైదరాబాద్ నగరంలో అర్ధరాత్రి వేళ ఒంటరి మహిళ కనిపిస్తే చాలు చివిపస్తావా.. రేటెంత" అంటూ కామపిశాచుల నుంచి జుగుప్సాకరమైన ప్రశ్నలు. ఈ పోకిరీల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. ఈ అరాచకానికి ముగింపు పలకాలని నిర్ణయించుకున్న మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి సాధారణ మహిళగా మారి అర్ధరాత్రి రంగంలోకి దిగారు. ఆమె చేపట్టిన సీక్రెట్ ఆపరేషన్ ఇప్పుడు పోకిరీల గుండెల్లో వణుకు పుట్టిస్తోంది. దిలుసుఖ్‌నగర్ ప్రాంతంలో మహిళల పై వేధింపులు ఎక్కువయ్యాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో.. ఆమె ఎవరూ ఊహించని రీతిలో ఒక సాహసోపేతమైన ఆపరేషన్‌కు శ్రీకారం చుట్టారు. ఇటీవల ఆమె మల్కాజిగిరి సీపీగా బాధ్యతలు స్వీకరించగా.. ఆతర్వాతి రోజే అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఎలాంటి భద్రతా సిబ్బంది లేకుండా సాదాసీదా దుస్తుల్లో ఒక సామాన్య మహిళలా దిలుసుఖ్ నగర్ బస్టాండ్‌కు వద్దకు చేరుకున్నారు. అక్కడ బస్సు కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికురాలిలా నిల్చున్నారు. కమిషనర్ అని తెలియని దాదాపు 40 మంది పోకిరీలు ఆమెను మట్టుముట్టారు. మద్యం, గంజాయి మత్తులో ఉన్న యువకులు ఆమెపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేస్తూ.. దారుణంగా వేధించారు. అర్ధరాత్రి 12 నుండి తెల్లవారుజామున 3 వరకు సుమారు మూడు గంటల పాటు ఆమె ఆ నరకాన్ని మౌనంగా భరిస్తూనే అక్కడి పరిస్థితులను గమనించారు. ఈక్రమంలో పోలీసుల వైఫల్యం కూడా బట్టబయలైంది. మూడు గంటల పాటు ఆ పరిసరాల్లో ఒక్క పెట్రోలింగ్ వాహనం కూడా కనిపించలేదు. చివరకు తెల్లవారుజామున 3:30 గంటలకు ఒక బీట్ కానిస్టేబుల్ అటువైపు వచ్చారు. వరుసగా మూడు రోజుల పాటు ఇదే తరహాలో నిఘా పెట్టిన సుమతి.. మొత్తం 40 మంది పోకిరీలను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వీరిలో అత్యధికంగా హాస్టల్స్‌లో ఉంటూ చదువుకోవాల్సిన విద్యార్థులే ఉండటం గమనార్హం. మద్యం, డ్రగ్స్ మత్తులో విద్యార్థులు దారి తప్పుతున్నారని, మహిళలు ఒంటరిగా కనిపిస్తే మృగాల్లా ప్రవర్తిస్తున్నారని కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులందరికీ కౌన్సిలింగ్ నిర్వహించడంతో పాటు విధి నిర్వహణలో నిరక్ష్యం వహించిన పెట్రోలింగ్ సిబ్బందిపై కూడా ఆమె సీరియస్ అయ్యారు. నగరంలో మహిళల భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఇకపై ఇలాంటి ఆపరేషన్లు నిరంతరం కొనసాగుతాయని ఆమె హెచ్చరించారు. బాధ్యతలు చేపట్టిన తొలిరోజే ఫీల్డ్‌లోకి దిగి నేరగాళ్ల ఆట కట్టించిన సుమతి సాహసం ఇప్పుడు సర్వత్రా ప్రశంసలు అందుకుంటోంది. నగర వ్యాప్తంగా ఉన్న ఇలాంటి పోకిరీల ఆట కట్టించాలని ప్రజలు కోరుతున్నారు.

కెపిహెచ్‌బిలో సిఎంసి కమిషనర్ సృజన పర్యటన

హైదరాబాద్,మే 6, ప్రభాతవార్త:
రోజుకోవార్డు కార్యక్రమంలో భాగంగా 8వ రోజు బుధవారం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన కూకట్‌పల్లి జోన్ కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని కేపీహెచ్‌బీ కాలనీలో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.పర్యటనలో భాగంగా కమిషనర్ స్థానిక పౌరులు రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో ముఖాముఖి మాట్లాడారు. అక్కడి సౌకర్యాల పరిస్థితిని స్వయంగా అడిగి తెలుసుకుని, క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను సమీక్షించారు. ఈసందర్భంగా రెసిడెన్షియల్ ప్రతినిధులు లేవనెత్తిన అంశాలు స్థానిక హాస్టళ్ల వల్ల కలుగుతున్న ఇబ్బందులు, రోడ్ల పక్కన వంటలు చేయడం, అంతర్గత రహదారులపై ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్, ఫుట్‌పాత్‌ల ఆక్రమణల వల్ల పాదచారులకు ఎదురవుతున్న సమస్యలను నివాసితులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. వీటితో పాటు ఎంపిల్యాండ్స్ కింద పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల గురించి కూడా ప్రస్తావించారు. అలాగే మెహఫిల్ హోటల్ నుండి ఇందు ప్రాజెక్ట్స్ వరకు ఉన్న ఫుట్‌పాత్ ఆక్రమణలపై సమీక్ష జరిపారు. ట్రాఫిక్ క్రమశిక్షణను పెంచాలని, బహిరంగ ప్రదేశాల నిర్వహణను మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఎస్‌డబ్ల్యూఎం నిబంధనలు 2026 ప్రకారం చెత్తను మూలం వద్దే వేరు చేయడం పార్కుల్లో ఎండుటాకుల కంపోస్టింగ్ యూనిట్ల ఏర్పాటు..పాత ఫర్నిచర్ మరియు థర్మాకోల్ వంటి బల్క్ వ్యర్థాల కోసం వారపు సేకరణ వ్యవస్థను ప్రవేశపెట్టడం వంటివాటిపై సమీక్షించారు.ఇలా గుర్తించిన అన్ని సమస్యలను నమోదు చేసుకున్నామని డిప్యూటీ కమిషనర్ సంబంధిత విభాగాలు ఈ పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టి, చర్యలు తీసుకున్న నివేదికలను సమర్పించాలని కమిషనర్ సూచించారు.అలాగే, రాబోయే జనగణన 2027, సెల్ఫ్‌ఎన్యుమరేషన్‌లో (స్వయం నమోదు) నివాసితులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ సృజన

హైడ్రా ప్రజావాణికి 4 వారాల విరామం

-పెండింగ్ ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు

హైదరాబాద్, మే 6,ప్రభాతవార్త: ప్రజావాణికి 4 వారాల పాటు విరామాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రకటించారు. వేలాదిగా వచ్చిన ఫిర్యాదులను ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తున్నామని.. మిగిలి ఉన్నవి కూడా క్లియర్ చేసేందుకే 4 వారాలు విరామాన్నిచ్చినట్టు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 8వ తేదీ నుంచి యథావిధిగా హైడ్రా ప్రజావాణి కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రజావాణితో పాటు.. వివిధ రూపాల్లో వచ్చిన ఫిర్యాదులన్నీ క్లియర్ చేయాలనే ఉద్దేశంతోనే ఈ విరామాన్ని ప్రకటించినట్టు తెలిపారు. అయితే గతంలో ఇచ్చిన ఫిర్యాదుదారులు అత్యవసరమని భావిస్తే కార్యాలయానికి వచ్చి నేరుగా కలవచ్చన్నారు. అలాగే ముఖ్యమైన సమస్యలున్నా నేరుగా కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయవచ్చునని పేర్కొన్నారు.

అవినీతిమయంగా విద్యుత్ డిఇ, ఏడిఇల కార్యాలయాలు

-ముడుపులు ఇస్తేనే కదులుతున్న ఫైళ్లు

హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త :
టీజీ ఎస్పీడీఎల్ విద్యుత్ డీఇ, ఏడీఇల కార్యాలయాలు అవినీతి, అక్రమ వసూళ్లకు అడ్డాలుగా మారాయి. పలు ప్రాంతాల్లో వెలుస్తున్న వ్యక్తిగత గృహాలు, బహుళ అంతస్తుల భవనాలు కొందరు అధికారులకు కాసులు కురిపిస్తున్నాయి. సికింద్రాబాద్ ఎస్ఇ కార్యాలయం పరిధిలోని బోయిన్‌పల్లి, కంటోన్మెంట్, ప్యారడైజ్ డీఇ కార్యాలయాలతో పాటు బాలానగర్, బోయిన్‌పల్లి ఏడీఇ, ఏఇల కార్యాలయాల్లో ముడుపులు ఇస్తేనే ఫైళ్లు ముందుకు కదులుతున్నాయి. కొత్త కనెక్షన్లు, ప్యానెల్ బోర్డులు, డిటిఆర్ లైన్ల మంజూరుకు కొందరు డీఇలు, ఏడీఇలు, ఏఇలు ఇస్టారాజ్యంగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అపార్ట్‌మెంట్‌కు కనెక్షన్ కావాలంటే ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీనికిగాను పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకుంటున్నట్లు తెలిసింది. కొందరు డీఇలు, ఏడీఇలు, ఏఇలు అక్రమ వసూళ్లలో మునిగి తేలుతున్నారు. చేయి తడిపితే గాని కొందరు అధికారులు పనులు చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. డబ్బులు ఇవ్వకుంటే సదరు దస్త్రంలో లేనిపోని కారణాలు చూపిస్తూ కొందరు అధికారులు పనులు చేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఎంతసేపు వ్యక్తిగత గృహాలు, బహుళ అంతస్తుల భవనాలకు సంబంధించిన కొత్త కనెక్షన్ల మంజూరులో కొందరు డీఇలు, ఏడీఇలు, ఏఇలు లంచాలను దండుకుంటూ యమ బిజీగా ఉంటూ వినియోగదారుల సమస్యలను పట్టించుకోవడం లేదు. ప్రతి పనికి ముందుగా వర్క్ ఎస్టిమేషన్లు వేయాలి. ఈ ఎస్టిమేషన్లు వేసేటప్పుడే కొంతమంది అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. విద్యుత్తు డీఇ, ఏడీఇ, ఏఇ కార్యాలయాలకు వెళ్లి వినియోగదారులు జేబులు ఖాళీ అవుతుండగా, అధికారులు మాత్రం జేబులు నింపుకుంటున్నారు.

దేశీయ నూనెగింజల స్వయం సమృద్ధికి మరొక కీలక అడుగు

అత్తాపూర్ మే6 ,ప్రభాతవార్త : భారత ఆర్థిక వ్యవస్థలో నూనెగింజల పంటలకు అత్యంత ప్రాధాన్యం ఉందని దేశంలో పోషక భద్రతను నిర్ధారించడంలో మరియు దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తున్నాయని వ్యవసాయ పరిశోధన మరియు విద్యా శాఖ (డిఎఆర్ఈ) కార్యదర్శి మరియు భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి డైరెక్టర్ జనరల్ డా. మంగి లాల్ జాట్ పేర్కొన్నారు. ఐసిఐసిఐ ఫౌండేషన్ సహకారంతో అధునాతన పరిశోధన మౌలిక వసతులను ఏర్పాటు చేసే దిశలో ముఖ్యమైన మైలురాయిగా స్ప్రీడ్ బ్రీడింగ్ సదుపాయం" రాజేంద్రనగర్‌లోని భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ (ఐసిఎఆర్-ఐఐఓఆర్)లో ఏర్పాటు చేసిన అత్యాధునిక స్ప్రీడ్ బ్రీడింగ్" సదుపాయాన్ని (క్రాప్ సైన్స్) జనరల్ డిప్యూటీ డైరెక్టర్ డి.కె. యాదవ , డైరెక్టర్ డా. ఆర్.కె. మాథుర్‌లతో కలిసి భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి డైరెక్టర్ జనరల్ డా. మంగి లాల్ జాట్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నియంత్రిత వాతావరణ పరిస్థితులను ఉపయోగించి మొక్కల పెరుగుదలను వేగవంతం చేయడం ద్వారా ఈ సాంకేతికత ను వినియోగించి తక్కువ సమయంలోనే పంట రకాలను అభివృద్ధి చేయడానికి సహాయపడుతుందని ప్రస్తుతం భారతదేశం తన తినదగిన నూనెల అవసరాలలో సగానికి పైగా దిగుమతుల ద్వారా తీర్చుకుంటోంది. దీనివల్ల ప్రతి సంవత్సరం సుమారు రూ. 1.6 లక్షల కోట్ల వ్యయం జరుగుతోంది.భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి ఆధ్వర్యంలోని రాజేంద్రనగర్‌లో ఉన్న భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ దేశంలో నూనెగింజల రంగంలో ప్రముఖ పరిశోధన సంస్థగా నిలుస్తోంది. ప్రొద్దు తిరుగుడు, నువ్వులు, కుసుమ, వలిసెలు, అవిసెలు, మరియు ఆముదం వంటి ముఖ్య నూనెగింజ పంటలపై ఈ సంస్థ విస్తృత పరిశోధనలు చేపడుతోంది. అధిక దిగుబడులు ఇచ్చే రకాలను అభివృద్ధి చేయడం, ఆధునిక సాగు మరియు రక్షణ సాంకేతికతలను రూపొందించడం, రైతుల ఆదాయాన్ని పెంచడం లక్ష్యంగా సంస్థ కృషి చేస్తోంది. సాంప్రదాయ బ్రీడింగ్ పద్ధతుల ద్వారా పురోగతి సాధించినప్పటికీ, సమయ పరిమితులు ప్రధాన అడ్డంకిగా మారుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఐసిఎఆర్-నారం డైరెక్టర్ డా. గోపాల్ సింగ్, ఐసిఎఆర్-ఐఐఆర్ఆర్ డైరెక్టర్ డా. ఆర్.ఎం. సుందరం, ఐసిఎఆర్ ఐఐఎంఆర్ డైరెక్టర్ డా. తారా సత్యవతి, నువ్వులు మరియు నైజర్ పంటల ప్రాజెక్ట్ కోఆర్డినేటర్లు, హైదరాబాద్‌లోని వివిధ ఐసిఎఆర్ ప్రాంతీయ కేంద్రాల డైరెక్టర్లు మరియు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

నమ్మకంగా ఉంటూ దోచేసింది!

- రూ. 19 లక్షల చోరీలో రూ. 8 లక్షలు స్వాధీనం ..ఇద్దరు నిందితులు అరెస్ట్

జూబ్లీహిల్స్, మే 6, ప్రభాతవార్తః నమ్మకంగా పనిచేస్తూ లక్షల రూపాయలు కాజేసిన ఒక పనిమనిషితోపాటు ఆమెకు సహరించిన మరో యువకుడిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. జూబ్లీహిల్స్ డిఐ సత్యనారాయణ కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ ఎంపీ, ఎమ్మెల్యే కాలనీలో నివసించే అజయ్ అనే వ్యాపారి నివాసంలో గత మూడేళ్లుగా నల్గొండ జిల్లా చెందిన సైదమ్మ పనిచేస్తుంది. ఆమెతోపాటు ఆమె మైనర్ కుమార్తె(17) కలిసి కొద్ది కాలంగా యజమాని ఇంట్లో నగదును చోరి చేస్తున్నారు. ఇది గమనించిన ఇంటి యజమాని రూ. 40వేలను ఇంట్లో పెట్టాడు. అక్కడికి వచ్చిన సైదమ్మ కుమార్తె ఆయా డబ్బులను చోరి చేసింది. ఇది గుర్తించిన యజమాని వారిని నిలదీయడంతో డబ్బు తీసినట్లు అంగీకరించి తిరిగి ఇచ్చారు. మరుసటి రోజు నుంచి పనిమానేశారు. అదే సమయంలో యజమాని ఇంట్లో గమనించగా దాదాపు రూ. 19లక్షల నగదు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు బోరబండలోని సైదమ్మ నివాసంపై దృష్టి పెట్టారు.

అరెస్ట్ అయిన నిందితులు దేవకుమార్, సత్తెమ్మ.

ఈ క్రమంలోనే సైదమ్మ కుమార్తెకు స్నేహితుడైన దేవకుమార్ సైతం ఈ వ్యవహారంలో పాలుపంచుకున్నట్లు గుర్తించి సైదమ్మను, దేవకుమార్‌ను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 8 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన నగదుతోపాటు నిందితురాలి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులిద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డిఐ తెలిపారు. రూ. 8 లక్షల నగదును, కొంత సొమ్ముతో కొనుగోలు చేసిన ఖరీదైన

డిజిపిని సత్కరించిన కిలారు

సీవీ ఆనంద్‌ను కలిసిన కిలారు రాజేశ్వరరావు

జూబ్లీహిల్స్, మే 6, ప్రభాతవార్తః డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన సీవీ ఆనంద్‌ను జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ మాజీ కార్యదర్శి కిలారు రాజేశ్వరరావు సత్కరించారు. డీజీపీ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వ కంగా కలిసిన కిలారు శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. రాష్ట్రంలో వివిధ హోదాల్లో అనేక సేవలందించిన సీవీ ఆనంద్ డీజీపీగా మరింత వన్నె తీసుకురావాలని కోరారు. తెలంగాణ పోలీ సులకు ఉన్న పేరును మరింత ముందుకు తీసుకెళ్లాలని, విప్లవా త్మకమైన మార్పులతో తనదైన ముద్ర వేసుకోవాలని కోరారు.

ధన్వంతరి ఫౌండేషన్ భూములను వేలం వేసి బాధితులకు న్యాయం చేయాలి : గిరిప్రసాద్‌శర్మ

సమావేశంలో మాట్లాడుతున్న గిరిప్రసాద్‌శర్మ

సైఫాబాద్, మే 6 ప్రభాతవార్త: ధన్వంతరి ఫౌండేషన్ ఇంటర్నేషనల్ సంస్థపై నాంపల్లి ఎంఎస్ కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఆ సంస్థ ఆస్తులను వేలం వేసి, వచ్చిన మొత్తం డబ్బును బాధితులకు చెల్లించాలని తీర్పు ఇచ్చిందని బాధితుల హక్కుల పరిరక్షణ ట్రస్ట్ తెలిపింది. ఆ సంస్థ చైర్మన్ కమలాకర్‌శర్మ, జయశ్రీ, ఇతర మహిళా డైరెక్టర్లు దాఖలు చేసిన స్టే పిటిషన్‌లను హైకోర్టు కొట్టివేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఫౌండేషన్ భూముల వేలంపై స్పష్టత ఇవ్వడం లేదని ట్రస్ట్ కన్వీనర్ గిరిప్రసాద్‌శర్మ మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విచారం వ్యక్తం చేశారు. భూలావాదేవీల్లో ప్రమేయం ఉన్నట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న శ్రీరంగ అన్నపూర్ణశర్మ, లక్ష్మణ్‌లను ఎఫ్ఐఆర్‌లో చేర్చకపోవడం వెనుక ఉన్న అసలు సంగతి ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఆ ఇరువురిని తక్షణమే అరెస్టు చేసి సమగ్రంగా దర్యాప్తు చేయాలని ఆయన కోరారు. సత్య జారి, డాక్టర్ జయశ్రీలకు మంజూరు చేసిన బెయిల్‌ను తక్షణమే రద్దు చేయాలని, వారు గనుక బయటకు వస్తే సాక్షులను ప్రభావితం చేస్తారని, దీంతో న్యాయం అలస్యంగా వస్తుందని ఆయన విచారం వ్యక్తం చేశారు. ఈ కేసుతో సంబంధం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కమలాకరశర్మ, ఇతరులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ట్రస్ట్ కో-కన్వీనర్లు, సభ్యులు పాల్గొన్నారు.

శిల్పకళావేదికలో నాదపరంపర సంగీత మహోత్సవం

150మంది కళాకారులతో గ్రాండ్ వయోలిన్ సింఫనీ

నాంపల్లి, మే 6 ప్రభాతవార్త : ప్రముఖ సాంస్కృతిక వేదిక అరభిది సెంటర్ ఫర్ ఫర్ఫార్మింగ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో 9 శనివారం సాయంత్రం 5గంటల నుండి శిల్పకళావేదికలో నాదపరంపర శీర్షికన సంగీత మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధినేత, ప్రముఖ సంగీత విద్వాంసుడు కళారత్న డా. అశోక్ గుర్జాలే పత్రికా ప్రకటనలో తెలిపారు. సంస్థ 28వ వార్షికోత్సవ వేడుకల్లోల భాగంగా నిర్వహిస్తున్న ఈ మహోత్సవంలో సంగీతప్రియులను అబ్బురపరిచేలా 150మంది ప్రముఖ కళాకారులతో గ్రాండ్ వయోలిన్ సింఫని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. చిన్నారుల నుండి యువకళాకారుల వరకు పాల్గొనే ఈ విలక్షణ సంగీత ప్రదర్శన భారతీయ శాస్త్రీయ సంగీత వైభవాన్ని పరిమళింపజేస్తుందని అన్నారు. భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ముఖ్యఅతిథిగా హాజరవుతున్న ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథులుగా పద్మశ్రీ ఎల్లా వెంకటేశ్వరరావు, డా. దీపికారెడ్డి, దారూరి రాఘవాచారి, రాంకుమార్ మోహన్, జి.కిషన్‌రావు, తనికెళ్ళభరణి, డా. జె.అనురాధ, జి.అనురాధరెడ్డి, కళ్యాణి ద్విభాష్యం తదితరులు పాల్గొంటారని వివరించారు. ప్రముఖ మృదంగ విద్వాంసుడు పాలకుర్తి రామచంద్రశర్మను మృదంగ విభూషణ్ బిరుదుతో సత్కరించనున్నట్లు డా. అశోక్ గుర్జాలే పేర్కొన్నారు.

ఎస్ఐఆర్ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోండి


ముఖ్య ఎన్నికల అధికారికి వినతి పత్రం అందజేస్తున్న రాష్ట్ర ఎస్ఐఆర్ సభ్యులు పొన్న వెంకటరమణ

చాంద్రాయణగుట్ట, మే 6, ప్రభాతవార్త : ఓటర్లను మ్యాపింగ్ చేయటంలో బూత్ లెవల్ అధికారులు (బిఎల్ఓలు) చేస్తున్న తప్పిదాలపై సమగ్ర విచారణ జరిపి, ఇంతవరకు హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో జరిగిన ఓటర్ మ్యాపింగ్ వివరాలు అందించాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) సభ్యులు పొన్న వెంకటరమణ బుధవారం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారిని కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రత్యేకించి కొన్ని ప్రాంతాల్లో ఒక వర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు తప్పుడు సమాచారం ఇచ్చి ఓటర్లను తప్పుగా మ్యాప్ చేయిస్తున్నారని వివరించారు. ఒక కుటుంబంలో తండ్రి, కొడుకు, కోడలు, చిన్న పిల్లలు ఉన్నప్పుడు, కోడలిని కూతురిగా చూపిస్తూ తండ్రితో ఓటును మ్యాప్ చేయడం జరిగిందన్నారు. శాలిబండ డివిజన్‌లో పెద్ద సంఖ్యలో ఈ విధమైన లోపాలు గుర్తించినట్లు ఉదహరించారు. తన కుటుంబానికి సంబంధించిన ఓటర్ను రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన ఓటర్‌తో తప్పుగా మ్యాప్ చేశారని, విషయం తెలిసి రాజేంద్రనగర్ బీఎల్ఓను సంప్రదించి, అక్కడ నుండి అన్‌మ్యాప్ చేయించి తిరిగి సరైన ప్రాంతానికి మ్యాప్ చేయించుకున్నట్లు పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీసం 12 కంప్యూటర్లు మరియు నైపుణ్యం గల ఆపరేటర్లను ఏర్పాటు చేసి, ఎస్ఐఆర్ మ్యాపింగ్ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కేశవగిరిపై నేత్రపర్వంగా లక్ష్మీచెన్నకేశవుల కల్యాణం


లక్ష్మీచెన్నకేశవుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకస్వాములు

చాంద్రాయణగుట్ట, మే 6, ప్రభాతవార్త : చాంద్రాయణగుట్ట కేశవగిరిపై వెలసిన స్వయంభుః శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి దేవస్థానం ఆవరణలోని కల్యాణ మండపంలో బుధవారం లక్ష్మీచెన్నకేశవుల కల్యాణ మహోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు కంజర్ల ప్రతాపాచార్యుల పర్యవేక్షణలో అర్చక స్వాములు కంజర్ల ప్రణయ్ కుమారాచార్యుల ఆధ్వర్యంలో దమ్మాయగూడ రాజశేఖర్, మీనాకుమారి దంపతులు స్వామి వార్ల కల్యాణాన్ని జరిపించారు. అర్చకస్వాముల మంత్రోచ్చారణల మధ్య స్వామి వారు అమ్మవారి మెడలో మంగళ సూత్రధారణ చేశారు. ఒకరిపై ఒకరు తలంబ్రాలు పోసుకున్నారు. చూడ ముచ్చటైన కల్యాణాన్ని తిలకించేందుకు సమీప బస్తీల భక్తులు హాజరైయ్యారు. అంతకుముందు ఆలయంలో కొలువైన స్వామి వార్లకు విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులు లక్ష్మీచెన్నకేశవులను దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కన్నులపండువగా శ్రీనివాసుడి కల్యాణం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా పూజాది కార్యక్రమాలు నిర్వహించిన దృశ్యం

చిక్కడపల్లి, మే 6 ప్రభాతవార్త: వేదపండితులు మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ కలియుగప్రత్యక్షదైవం శ్రీనివాసుడి కల్యాణ మహోత్సవం బుధవారం ఆలయం వ్యవస్థాపక వంశీయులు గుడిదేవుని శ్రీనాథ్‌గౌడ్, ఈవో, సహాయ కమిషనర్ వి.అంబుజ సమక్షంలో రమణీయంగా సాగింది. కళ్యాణోత్సవం సందర్భంగా ఉదయం సుప్రభాతసేవ, పుణ్యాహవాచనము, బిందెతీర్థము, బాలభోగము, బలిహరణం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామివారికి పల్లకీసేవ కార్యక్రమాన్ని శోభాయమానంగా నిర్వహించారు. మహానివేదన, హారతి, మంత్రపుష్పం కార్యక్రమం జరిగింది. అనంతరం ప్రబంధపారాయణం, మహానివేదన, హవనం, హారతి, మంత్రపుష్పం జరిగింది. కల్యాణోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశారు. ముందుగా ఎదురుకోళ్ళు, అనంతరం స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన అలివేలుమంగా సమేత ఈ ఉత్సవాన్ని పాంచరాత్రాగమ శాస్త్రానుసారంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయం వ్యవస్థాపక వంశీయులు స్వర్గీయ గుడిదేవుని రాజేంద్రనాథ్‌గౌడ్ సతీమణి జి.సువర్ణలత, కుమారుడు జి.శ్రీనాథ్‌గౌడ్-జి.కీర్తి దంపతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు గరుధవాహనసేవ

కాగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం గరుధవాహనసేవ ఉంటుందని ఆలయం అలయం వ్యవస్థాపక వంశీయులు జి.శ్రీనాథ్‌గౌడ్, ఈవో, సహాయ కమిషనర్ అంబుజ వివరించారు. ఉదయం సుప్రభాతసేవ, పుణ్యాహవాచనము, బిందెతీర్థము, హవనము, బలిహరణం, బాలభోగము, మంత్రపుష్పము, పల్లకీసేవ, మహానివేదన, వేదపారాయణాలు, ద్రావిడ ప్రబంధము ఉంటుంది. సాయంత్రం జరిగే వాహన సేవలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కంటితుడుపుగా కెమేరాలు.. భద్రతకు తిప్పలు!

-పనిచేయని సీసీ కెమెరాలు.. పట్టించుకోని పోలీసులు

-చీకటి పడితే జనం బేజారు.. చిక్కడపల్లి పరిధిలోని కాలనీల దీనస్థితి

చిక్కడపల్లి, మే 6 ప్రభాతవార్త : నేరాల నియంత్రణలోనూ, నిందితులను పట్టుకోవడంలోనూ సీసీ కెమెరాలు అత్యంత కీలకం. కానీ చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు కాలనీల్లో మాత్రం పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉంది. లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన కెమెరాలు నేడు మూలపడ్డాయి. ఫలితంగా స్థానిక ప్రజలు భద్రత లేక భయం భయంగా గడుపుతున్నారు. ప్రధానంగా అచ్చయ్యనగర్, పద్మా కాలనీ, బృందావన్ కాలనీ, ఇందిరా కాలనీ తదితర ప్రాంతాలలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం గతంలో భారీగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రారంభంలో ఆర్భాటం చేసిన పోలీసులు, ఆ తర్వాత వాటి నిర్వహణను గాలికి వదిలేశారు. గత రెండు సంవత్సరాలుగా ఈ కెమెరాలు మొరాయించి ఉన్నా, వాటిని బాగు చేసే నాథుడే కరువయ్యారు. ప్రజలకు చేరువగా ఉంటూ భద్రత కల్పిస్తామన్న ఫ్రెండ్లీ పోలీసింగ్ మాట ఇక్కడ ఎక్కడా కనిపించడం లేదు. కెమెరాలు పనిచేయకపోవడంతో గొలుసు దొంగతనాలు, వాహనాల చోరీల భయం కాలనీ వాసులను వెంటాడుతోంది. ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే ఆధారాల కోసం వెతకాల్సిందే తప్ప, నిఘా నేత్రాల ద్వారా నిందితులను పట్టుకునే పరిస్థితి లేదని స్థానికులు వాపోతున్నారు.

కాగా కాలనీలో కెమెరాలు ఉండి కూడా లేనట్టే. రెండేళ్లుగా అవి పనిచేయడం లేదని అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. అసాంఘిక కార్యకలాపాలు పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా చిక్కడపల్లి పోలీసులు స్పందించి కొత్త కెమెరాలు ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

గ్యాస్ డెలివరీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

-కార్మిక శాఖ కార్యదర్శి దాసరి హరిచందనకు వినతి

సెక్రటరీ హరిచందనకు వినతిపత్రం ఇస్తున్న చిరంజీవులు, రాజు, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

హైదరాబాద్, మే 6,ప్రభాతవార్త: కుకింగ్ గ్యాస్ డెలివరీ బాయ్స్ ఎదుర్కొంటున్న సమస్యలను నెల రోజులలోపు పరిష్కరించేందుకు కృషి చేస్తామని కార్మిక శాఖ కార్యదర్శి దాసరి హరి చందన హామీ ఇచ్చారు. బుధవారం తెలంగాణ కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ సలహాదారు కమిటీ చైర్మన్ మాజీ ఐఏఎస్ అధికారి టి చిరంజీవులు ,కమిటీ నాయకులు చామకూర రాజు, అధ్యక్షులు నకిరేకంటి శ్రీనివాస్ గౌడ్ కార్యదర్శులు అజయ్ రెడ్డి ,నగేష్ గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ నాయకులు యునుస్ తదితరులు సెక్రటేరియట్‌లో ఎల్.పి.జీ డెలివరీ బాయ్స్ ఎదుర్కొంటున్న సమస్యలు హరిచందన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ .టి చిరంజీవులు మాట్లాడుతూ ఎల్.పి.జీ డిస్ట్రిబ్యూటర్లు సిలిండర్లు సరఫరా చేసే కార్మికులకు కనీస జీతాలు చెల్లించడం లేదన్నారు. ఈ ఎస్ఐ ,పిఎఫ్ లు ఇవ్వడం లేదన్నారు. రాష్ట్రంలో 806 గ్యాస్ ఏజెన్సీ డిస్ట్రిబ్యూషనర్లు ఉన్నారని వారు కార్మిక శాఖ ఇతర ప్రభుత్వ శాఖనియమాలను పాటించ కుండా శ్రమదోపిడికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐడెంటిటీ కార్డులు అపాయింట్మెంట్ లెటర్ కూడా ఇవ్వడం లేదని కార్యదర్శి దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్రంలో 806 గ్యాస్ ఏజెన్సీ డిస్ట్రిబ్యూషనర్లు ఉన్నారని వారు కార్మిక శాఖ ఇతర ప్రభుత్వ శాఖలను నియమాలను పాటించకుండా కార్మికుల శ్రమదోపిడికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు కార్మికులకు వివిధమైన ముందస్తు సమాచారం లేకుండా అక్రమంగా తొలగిస్తున్నారని వారాంతపు సెలవులు కూడా ఇవ్వడం లేదని అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా కార్యదర్శి హరిచందన మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై స్పందించి డిస్ట్రిబ్యూటర్లకు కార్మిక శాఖ తరపున నోటీసులు పంపిస్తామని డిస్ట్రిబ్యూటర్లతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

మంత్రి కొండా సురేఖ క్షమాపణలు చెప్పాలి

- బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చికోటి ప్రవీణ్

జూబ్లీహిల్స్, మే 6, ప్రభాతవార్తః తెలంగాణ రాష్ట్ర మంత్రి కొండా సురేఖ హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, హిందూ ధర్మరక్ష వ్యవస్థాపకులు డాక్టర్ చికోటి ప్రవీణ్ డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మంత్రి కొండా సురేఖ జై శ్రీరాం అనే పవిత్ర నినాదాన్ని డబ్బుతో పోల్చడం హిందూ ధర్మంపై దాడి అని అన్నారు. దేవాదాయ శాఖ మంత్రిగా ఉండి దైవ విశ్వాసాలను అవమానించడం దురదృష్టకరమన్నారు. కోట్లాది మంది హిందువుల మనోభావాలను ఆమె దెబ్బతీశారని, దీనికి కాంగ్రెస్ పార్టీ సమాధానం చెప్పాలన్నారు. దైవాన్ని అవమానించిన వారికి ప్రజలు తప్పనిసరిగా గుణపాఠం చెబుతారని ఆయన అన్నారు.

వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయం హుండీ ఆదాయం రూ.2 లక్షల 5 వేల 395

వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయం హుండి లెక్కింపు నిర్వహించిన దృశ్యం

చిక్కడపల్లి, మే 6 ప్రభాతవార్త: వివేక్ నగర్ ఆంజనేయస్వామిదేవాలయంలో బుధవారం హుండీ లెక్కింపు జరిగింది. ఆలయం పునర్ నిర్మాణ కమిటీ చైర్మన్ సుధాకర్, ఈవో మాచర్ల దేవనాథం, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్స్పెక్టర్ సురేఖ పర్యవేక్షణలో లెక్కించారు. 30 రోజు లకు గాను రూ. 2 లక్షల 5 వేల 395 ఆదాయం వచ్చింది. దేవాలయంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు బుగ్గా లక్ష్మ్ మ్పతిశర్మ, కందాళ వెంక టాద్రి భక్తులు పాల్గొన్నారు.

మద్యం వ్యసనంతో ప్లంబర్ మృతి

పేట్ బషీరాబాద్, మే 6, ప్రభాతవార్త పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం వ్యసనంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. అడ్డేపు అనిల్ కుమార్ (38) అనే వ్యక్తి వృత్తిరీత్యా ప్లంబర్‌గా పనిచేస్తూ, శ్రీరామ్ నగర్ కాలనీ, చింతల్‌లో తన అక్క ఇంట్లో నివసిస్తున్నాడు. ఇతని స్వగ్రామం వరంగల్ జిల్లా, కనిమాబాద్ మండలం ఎస్.ఆర్ తోట గ్రామం.స్థానికంగా ప్లంబింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న అనిల్ కుమార్ మద్యం అలవాటుకు బానిసగా మారినట్లు సమాచారం. ప్రతిరోజూ అధికంగా మద్యం సేవించడం వల్ల ఆరోగ్యం క్షీ ణించింది.ఈ క్రమం లో బుధవారం అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుం బ సభ్యులు తెలిపారు.సమాచారం అందుకున్న పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వడ్డెర కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

చైర్మన్ గుంజ రేణుకనారాయణను సన్మానిస్తున్న వేముల లోకేష్ తదితరులు

హదరాబాద్, మే 6,ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన వడ్డెర కార్పొరేషన్ సొసైటీనికి నూతనంగా చైర్మన్ గా ఎన్నికైన గుంజ రేణుక నారాయణను అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ యువజన అధ్యక్షుడు డాక్టర్ వేముల లోకేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా చైర్మన్ దంపుతలకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా వేముల లోకేష్ మాట్లాడులూ అఖిలభారత వడ్డెర సంఘం అభివృద్ధి కృషి చేయాలని కోరారు. అలాగే వడ్డెరల సమస్యలను చైర్మన్ దృష్టి తీసుకురావాలని సంఘం ప్రతినిధులకు పిలుపునిచ్చారు. వడ్డెర యువత పెడదారిన పట్టకుండా ప్రభుత్వ పథకాలను సద్వినిచేసుకోవాలని లోకేష్ కోరారు.

భార్యాభర్తల గొడవలతో మనస్థాపం - యువకుడు మృతి

పేట్ బషీరాబాద్, మే 6, ప్రభాతవార్త భార్యాభర్తల గొడవలతో మనస్థాపం భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుండ్ల పోచంపల్లి ప్రాంతానికి చెందిన నల్లూరి సాయికుమార్ (28) వృత్తి కార్ డ్రైవర్.సుమారు ఏడు సంవత్సరాల క్రితం అనుష (25)తో సాయికుమార్‌కు వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు (ఒక పాప, ఒక బాబు) ఉన్నారు. వివాహం జరిగిన తొలి సంవత్సరం వరకు దాంపత్య జీవితం సవ్యంగా సాగినా, అనంతరం భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నట్లు తెలిసింది.వారం రోజుల క్రితం జరిగిన గొడవ అనంతరం భార్య అనుష తన తల్లి ఇంటికి బహదూర్‌పల్లికి వెళ్లింది. ఈ నేపథ్యంలో మే 5, 2026 రాత్రి సుమారు 8:30 గంటల సమయంలో సాయికుమార్ తన స్నేహితుడికి వాట్సాప్ ద్వారా సందేశం పంపాడు. అనంతరం స్నేహితుడు ఇంటికి వెళ్లి చూడగా, సాయికుమార్ ఉరివేసుకున్న స్థితిలో కనిపించాడు.ఇదివరకు కూడా సాయికుమార్ రెండుసార్లు ఆత్మహత్యకు ప్రయత్నించగా, స్థానికులు, అతని స్నేహితుడు కాపాడినట్లు సమాచారం. భార్యాభర్తల మధ్య ఉన్న విభేదాల కారణంగా మనస్థాపానికి గురై ఈ ఘటనకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

కురుమల అభివృద్ధికి 18ఏళ్లుగా ఎనలేని కృషి

-సంఘం ప్రతిష్ట దెబ్బతీసేలా దుష్ప్రచారం సరికాదు

-రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షులు, మాజీ ఎంఎల్‌సి ఎగ్గె మల్లేశం

ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ఎగ్గెమల్లేశం, క్యామ మల్లేశ్, చీర శ్రీకాంత్, నారాయణ తదితరులు

హైదరాబాద్, మే 6,ప్రభాతవార్త: కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి 18 సంవత్సరాలలో పలు ప్రధాన ఆలయాల వద్ద వసతి గృహాలు ముస్లింలను వంతెన వద్ద విద్యార్థి వసతిగృహం ఇలా దాదాపు రెండు వేల కోట్ల రూపాయల ఆస్తులను కూడబెట్టగలిగినట్లు రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షులు, సంఘం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ మల్లేశం పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం హైదరాబాద్ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ మధ్యకాలంలో సామాజిక మాధ్యమాల ద్వారా కురుమ సంఘం ప్రతిష్టను దెబ్బతీసేలా కొందరు వ్యవహరిస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదన్నారు. ముస్లిం జంగ్ వంతెన వద్ద ఉన్న కురుమ సంఘం భవనాన్ని సంఘానికి చెందిన ఓ నాయకుడు నేలమట్టం చేస్తే కురుమలు ఏసమావేశం నిర్వహించుకోవాలన్నా నిలువ నీడ లేకుండా పోయిందని తాను సొంతంగా 50 లక్షలు, సంఘం ద్వారా చీటీల తో 40 లక్షల పెట్టి భవన నిర్మాణం పూర్తి చేసుకోగా ప్రస్తుతం అద్దె లభిస్తుందన్నారు. 2008 సంవత్సరంలో ఆనాటి కురుమ పెద్దలు సంఘం అధ్యక్షుడిగా ఉండాలని కోరగా తాను ఎన్నికలలో పోటీ చేసి వచ్చానని దొడ్డిదారిన రాలేదన్నారు. అదే విధంగా యాదాద్రి, కొమురవెల్లి లలో దాతల సహకారంతో స్థలాన్ని కొనుగోలు చేసి వసతి గృహాలను నిర్మించినట్లు తెలిపారు. మన్సూరాబాద్ లో మూడు ఎకరాల 10 గుంటల స్థలంలో 2014 సంవత్సరంలో బిర్లా ఓపెన్ మైండ్ పాఠశాల నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందన్నారు. అయితే పాఠశాల భవన నిర్మాణం కోసం నాటి సిఎం ,మంత్రి సహకారంతో దాదాపు కోటి రూపాయలకు పైగా భవన నిర్మాణ ఫీజును మినహాయింపు తీసుకోవడం జరిగిందన్నారు.. ప్రస్తుతం ఆ భవనం నుంచి ప్రతినెల అద్దె వస్తుందని తెలిపారు. కానీ ఇవన్నీ ఏమీ తెలియని కొందరు సంఘం గురించి రకరకాలుగా మాట్లాడడం మంచి పద్ధతి కాదన్నారు. కుల ప్రతిష్టను దిగ జార్చేలా వ్యవహరిస్తే కులస్తులు ఊరుకోరని ఎవరికైనా అనుమానాలు ఉంటే సంఘం కార్యాలయానికి వస్తే వారికి అన్ని చూపించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కురుమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ క్యామ మల్లేశం,చీర శ్రీకాంత్, బండారి నారాయణ, కొలుపుల నరసింహ, తూముకుంట అరుణ్ కుమార్, రెక్కల కొండల రాజ్, శ్రీనివాస్, బాలమని,విజయలక్ష్మి మిర్యాల విజయ తదితరులు పాల్గొన్నారు.

బిజెపిని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి : భరత్ గౌడ్

సికింద్రాబాద్ జెబిఎస్ వద్ద బిజెపి వాల్ పేయింటింగ్‌ను ప్రారంభిస్తున్న జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్ తదితరులు

కంటోన్మెంట్,మే 6 ప్రభాతవార్త: గ్రేటర్‌లో బిజెపిని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు,నాయకులు సైనికుల్లా పనిచేయాలని మహంకాలి జిల్లా బిజెపి అధ్యక్షుడు భరత్ గౌడ్ తెలిపారు. కంటోన్మెంట్ 4వ వార్డుకు చెందిన బిజెపి సీనియర్ నాయకుడు నాగభూషణ్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సికింద్రాబాద్ జెబిఎస్ వద్ద ఏర్పాటు చేసిన వాల్ పేయింటింగ్స్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భరత్ గౌడ్ మాట్లాడుతూ ఈనెల 10న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు కార్యకర్తలు,నాయకులు పెద్ద సంఖ్యలో తరలి రావాలన్నారు. సామాన్య కార్యకర్తలు, సిఎంలు,పీఎంలు అయిన చరిత్ర బిజెపికే ఉందన్నారు. తెలంగాణలో బిజెపికి ఎలాంటి నాయకత్వ లోపం లేదన్నారు. దేశంలో మోదీ చేపడుతున్న అభివృద్ధికి ఆకర్షితులై బిజెపిలో చేరుతున్నారన్నారు. ఇటీవల 5 రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 3 రాష్ట్రాల్లో బిజెపి అధికారంలోకి వచ్చిందన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బిజెపి అధికారంలోకి వస్తుందని దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు విజయానంద్,టోపీ శంకర్,సతీష్, రాఖేశ్,శ్రావన్,అరుణ్, ప్రభాకర్, సంతోష్, విజయరామారావు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌కు ఎయిర్ కూలర్ల వితరణ

నిమ్స్ డైరక్టర్‌తో నవయువ నిర్మాణ సంస్థ సభ్యులు.

జూబ్లీహిల్స్, మే 6, ప్రభాతవార్తః నిమ్స్ ఆసుపత్రిలో రోగుల సేవార్థం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ ఆధ్వర్యంలో కొనసాగే నవయువ నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ కూలర్లను అందించింది. వేసవి నేపథ్యంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వారి బంధువులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో ఏడు ఎయిర్ కూలర్లను అందించారు. ఎమ్మెల్యే తరుపున నవయువ నిర్మాణ్ ప్రతినిధులు ఆయా కూలర్లను నిమ్స్ ఆసుపత్రి డైరక్టర్ డాక్టర్ నగరి బీరప్పకు అందించారు. పేదలకు సాయం అందించేందుకు పెద్దమనుసుతో ముందుకొచ్చిన సంస్థ సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు నారికేల నరేష్, దినేష్, విక్రమ్ యాదవ్, మనోహర్, కార్తిక్‌లతోపాటు ఆసుపత్రి అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌రైటింగ్‌లో మాజీ ఎమ్మెల్యే చింతల

వాల్‌రైటింగ్‌లో మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి.

జూబ్లీహిల్స్, మే 6, ప్రభాతవార్తః ఈ నెల 10న ప్రధాని మోడి తెలంగాణాకు వస్తున్న నేపథ్యంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు సంబంధించిన ప్రచార కార్యక్రమంలో బుధవారం ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు. ఇందులో భాగంగా ప్రధాని రాకను ఆహ్వానిస్తూ చేపట్టిన వాల్‌రైటింగ్‌లో ఆయన పాల్గొని స్వయంగా రంగులు వేశారు. అనంతరం ఆయన మాట్లాడతూ.. బహిరంగ సభకు ప్రజలు, అభిమానులు పెద్దఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్, బీజేపీ నాయకులు గడ్డం వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి బోయ కార్పొరేషన్ వైస్ చైర్మన్‌గా బోయ నగేష్

చార్మినార్,మే 6 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతబస్తీకి చెందిన చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ బోయ నగేష్ వాల్మీకి బోయ కోఆపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్ వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు.రు.తెలంగాణ రాష్ట్రంలోని పలు నామినేటెడ్ పోస్టుల భర్తీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.రాష్ట్రంలోని 17 కార్పొరేషన్లకు చైర్మన్లతో పాటు వైస్ చైర్మన్లను బుధవారం నియమించింది.కాగా చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ బోయ నగేష్ వాల్మీకి బోయ కార్పొరేషన్ వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు.వాల్మీకి బోయ కార్పొరేషన్ వైస్ చైర్మన్‌గా నియమించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు బోయ నగేష్ ధన్యవాదాలు తెలియజేశారు.

మున్నూరు కాపు కార్పొరేషన్ వైస్ చైర్మన్‌గా భాస్కర్

చార్మినార్,మే 6 ప్రభాతవార్త : పాతబస్తీ యాకుత్‌పుర నియోజకవర్గానికి చెందిన టిపిసిసి ప్రధాన కార్యదర్శి అల్లం భాస్కర్ మున్నూరు కాపు కో ఆపరేటివ్ కార్పొరేషన్ వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు. రాష్ట్రంలోని 17 కార్పొరేషన్ల చైర్మన్లు,వైస్ చైర్మన్లను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.కాగా ఎన్నో ఏళ్ల నుంచి కాంగ్రెస్ పార్టీ కోసం కృషి చేస్తున్న టిపిసిసి ప్రధాన కార్యదర్శి అల్లం భాస్కర్ మున్నూరు కాపు కో ఆపరేటివ్ కార్పొరేషన్ వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు.ఈ సందర్భంగా అల్లం భాస్కర్ మాట్లాడుతూ తనను మున్నూరు కాపు కార్పొరే షన్ వైస్ చైర్మన్‌గా నియమించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నానని తెలిపారు..కాగా పాతబస్తీలోని ఇద్దరు కాంగ్రెస్ నాయకులకు కార్పొరేషన్ వైస్ చైర్మన్ల పదవులు లభించాయి.

ఈవెంట్స్ నిర్వాహకురాలికి వేధింపులు..కేసు నమోదు

జూబ్లీహిల్స్, మే 6, ప్రభాతవార్తః ఒక వేడుకల నిర్వాహకురాలిని మోసం చేయడమే కాకుండా బెదిరింపులు, వేధింపులకు పాల్పడుతున్న ఒకరిపై జూబ్లీహిల్స్ ఠాణాలో కేసు నమోదైంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. మణికొండలో ఒక యువతి(24) ఈవెంట్ ఆర్గనైజర్‌గా పనిచేస్తోంది. ఫిబ్రవరి 27న షాఫ్ట్ అకాడమీలో యాంకరింగ్ శిక్షణ కోసం వెళ్లిన సమయంలో అక్షయ్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది.ఆమెకు దగ్గరైన అక్షయ్ ఆమె పుట్టినరోజున మొబైల్ ఫోన్ తీసుకుని వ్యక్తిగత వివరాలు, కుటుంబ సభ్యుల వివరాలు తీసుకున్నాడు. అనంతరం ఆమెను బ్లాక్‌మెయిల్ చేస్తూ సంబంధం పెట్టుకోవాలని ఒత్తిడి చేశాడు. ఆమెను బెదిరించి దాదాపు రూ. 2 నుంచి 3 లక్షలు తన ఖాతాలో వేయించుకున్నాడు. వేర్వేరు నంబర్ల నుంచి ఆమెకు బెదిరిపు సందేశాలు పంపుతూ భయాందోళనలకు గురి చేశాడు. ఆమె ఇంటికి వెళ్లి మరి ఆమెను వేధించాడు. మంగళవారం రాత్రి జూబ్లీహిల్స్‌లోని రాఘవేంద్ర మెస్ వద్ద తన సోదరుడు, స్నేహితులతో ఉన్న సమయంలో అక్కడికి చేరుకున్న అక్షయ్, ఆమె ఫోన్ లాక్కొని చెంపదెబ్బ కొట్టడమే కాకుండా అసభ్యంగా ప్రవర్తిస్తూ బెదిరింపులకు పాల్పడ్డాడు. తన ఫోటోలు, వీడియోలను దుర్వినియోగం చేశాడని, బ్యాంక్ కార్డులను ఉపయోగించుకున్నాడని, మొబైల్‌ను హ్యాక్ చేసి లోకేషన్ ట్రాక్ చేశాడని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడి వద్ద ఉన్న మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, పెన్ డ్రైవ్‌లు, సంబంధిత ఖాతాలను స్వాధీనం చేసుకోవాలని బాధితురాలు ఫిర్యాదులో కోరారు.

అనుమానంతో భార్యను హత్య చేసిన భర్త

సంజీవరెడ్డి నగర్, మే 6, ప్రభాతవార్త: హైదరాబాద్ నగరంలోని ఫతేనగర్ శివశంకర్ కాలనీలో దారుణ ఘటన చోటుచేసుకుంది. అనుమానంతో భర్త భార్యను హత్య చేసిన సంఘటన సనత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సనత్ నగర్ ఇన్స్‌పెక్టర్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం ఒడిశా రాష్ట్రం జాజ్‌పూర్ జిల్లా వాసులైన చంద్ర బాను సమల్ (39), సస్మిత సమల్ (34) దంపతులు తమ ఇద్దరు పిల్లలు చందన్ (12), చందిని (9)తో కలిసి గత ఒక సంవత్సరం నుంచి శివశంకర్ కాలనీలో నివసిస్తున్నారు. మే 5, 2026 రాత్రి సుమారు 8 గంటల సమయంలో, భార్య ఇతరులతో మాట్లాడుతోందనే అనుమానంతో చంద్ర బాను ఆగ్రహానికి లోనై ఆమెపై దాడి చేశాడు. దీంతో తీవ్రంగా గాయపడిన సస్మిత అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఆమెను తొలుత బీబీఆర్ ఆసుపత్రికి తరలించి, అనంతరం మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి మార్చారు. అక్కడ చికిత్స పొందుతూ మే 6 తెల్లవారుజామున సుమారు 3 గంటలకు ఆమె మరణించింది. ఈ ఘటనపై సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ లో హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలి పారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.

డ్రగ్స్ విక్రయించేందుకు ప్రయత్నించిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అరెస్ట్

బేగంపేట మే 6,ప్రభాతవార్త బేగంపేట పోలీసుస్టేషన్ పరిధిలో ఎండిఎం మాదక ద్రవ్యాన్ని విక్రయించేందుకు ప్రయత్నించిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని బేగంపేట పోలీసులు అరెస్ట్ చేసారు.పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.యూసఫ్ గూడా కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అవినాష్(25) డ్రగ్స్ వ్యసనానికి బానిసయ్యాడు. అవసరమైన వానికి డ్రగ్స్ కూడా సరఫరా చేసేవాడు.బేగంపేటలోని వాట్సప్ పాన్ షాప్ వద్ద అనుమానాస్పదంగా కనిపించిన అవినాష్ ను బేగంపేట పోలీసులతో కలిపి టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.అతని వద్ద నుంచి 3గ్రాముల ఎండిఎం మాదక ద్రవ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

అర్చన ట్రావెల్ యజమానిపై కేసు నమోదు

ముషీరాబాద్, మే 6, ప్రభాతవార్త: టూర్లకు తీసుకువెళ్తామంటూ అనేక మంది నుంచి డబ్బులు వసూలు చేస్తూ మోసం చేస్తున్న అర్చన ట్రావెల్స్ యజమాని భోజరెడ్డిపై దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయింది. సీఐ అంజద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం బండ్లగూడకు చెందిన పరమేశ్‌రెడ్డి(43) అనే వ్యక్తి గోవా ట్రిప్పు కోసం జస్ట్ డయల్‌లో విచారించగా, హిమాయత్‌నగర్‌లోని అర్చన ట్రావెల్స్ నుంచి ఫోన్ వచ్చింది. ఆరుగురు గోవా వెళ్లేందుకు 55వేలు అవుతుందని అర్చన ట్రావెల్స్ వారు తెలిపారు. మార్చి 23వ తేదీ గోవా వెళ్లేందుకు, ఫిబ్రవరి 28వ తేదీ పరమేశ్వర్‌రెడ్డి 55వేల రూపాయలు అర్చన ట్రావెల్స్‌కు ట్రాన్స్ ఫర్ చేశారు. మార్చి 23వ తేదీ గోవా వెళ్లేందుకు అర్చన ట్రావెల్స్ ఏర్పాట్లు చేయకపోవటంతో ఏప్రిల్ 4వ తేదీ పరమేశ్వర్‌రెడ్డి అర్చన ట్రావెల్స్ కార్యాలయానికి వచ్చి, ప్రశ్నించటంతో 25 వేల రూపాయలు ట్రావెల్ యజమాని భోజిరెడ్డి చెల్లించి, మిగతా డబ్బు ఇస్తానని చెపుతూ కాలం గడుపుతూ ఉండటంతో, బుధవారం దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

రైల్వేలో ఎంప్లాయిస్ సంఘ్‌ను మరింత పటిష్టం చేయాలి : ఆదం సంతోష్

రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ సమావేశంలో ప్రసంగిస్తున్న ఆదం సంతోష్

కంటోన్మెంట్,మే 6 ప్రభాతవార్త: దక్షిణ మధ్య రైల్వేలో వివిధ బ్రాంచ్‌లలో పనిచేస్తున్న రైల్వే ఉద్యోగులు,కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎంప్లాయిస్ సంఘ్ ముందుంటుందని, అందు వల్ల ఎంప్లాయిస్ సంఘ్‌ను మరింత పటిష్టం చేసేందుకు ఉద్యోగులు, కార్మికులు పనిచేయాలని దక్షిణ మధ్య రైల్వే జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదం సంతోష్ కుమార్ తెలిపారు.బుధవారం రెజిమెంటల్ బజార్‌లోని సిమ్రాన్ హోటల్‌లో నిర్వహించిన 141వ డివిజనల్ కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల న్యాయమైన కోర్కెలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ప్రభాకర్ ఆంధ్రా, అధికార ప్రతినిధి ఎం.భరణి బానుప్రసాద్, డివిజనల్ కార్యదర్శి అరుణ్, ఎంప్లాయిస్ సంఘ్ నేతలు,రాజుగోపాల్, రాహుప్,పాషా తదితరులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్‌లో సమ్మర్ కోచింగ్ క్యాంప్ ప్రారంభం

చిన్నారులకు బహుమతులను అందజేస్తున్న విజయరెడ్డి

ఖైరతాబాద్, మే 6, (ప్రభాతవార్త):
ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఖైరతాబాద్ డివిజన్ ఓల్డ్ సి.ఐ.బి క్వార్టర్స్‌లో ఉన్న జీహెచ్ఎంసీ ప్లే గ్రౌండ్‌లో బ్రైట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సమ్మర్ కోచింగ్ క్యాంప్-2026 ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ఖైరతాబాద్ నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, మాజీ కార్పొరేటర్ పి. విజయ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ క్రీడలు, కరాటే వంటి శిక్షణల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ధైర్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఇలాంటి క్యాంపులు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.క్యాంప్‌లో పాల్గొనే విద్యార్థులకు నైపుణ్యాల అభివృద్ధి, ఫిట్‌నెస్‌పై ప్రత్యేక శ్రద్ధతో శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అదనంగా స్వీయరక్షణ పాఠాలు, జట్టు భావన పెంపొందించే కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సందీప్ రెడ్డి, షీ టీమ్ కోచ్‌లు రవి, లక్ష్మి, బీడబ్ల్యూఏ అధ్యక్షుడు వి. గోపినాథ్, ఛైర్మన్ ఎ. అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి జి. గోపాల్, కోశాధికారి శివ రామేందర్ ప్రసాద్, వాలీబాల్ కోచ్ జి.కె. కిషోర్ కుమార్, కరాటే కోచ్‌లు శ్రీధర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.స్థానికులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, ఇలాంటి శిక్షణ శిబిరాలు మరింతగా నిర్వహించాలని కోరారు.

17న సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ మినీ మహానాడు

సమావేశంలో పాల్గొన్న టీడీపీ నేతలు

ముషీరాబాద్, మే 6, ప్రభాతవార్త: మే 17వ తేదీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ మినీ మహానాడు నిర్వహించనున్నట్లు తెలుగుదేశం పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నేతలు తెలిపారు. బుధవారం సికింద్రాబాద్ పార్లమెంట్ కార్యాలయంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నాయకులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంకు శ్రీపతి సతీష్, పోలంపల్లి అశోక్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈనెల 17వ తేదీ మినీ మహానాడును అత్యంత వైభవంగా నిర్వహించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ప్రతి సంవత్సరం తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు జయంతి పురస్కరించుకుని మహానాడును పండుగలా ఆనవాయితీగా వస్తోందని, అందులో భాగంగా ఈసారి మినీమహానాడు సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో నిర్వహించాలని, దీనికోసం సికింద్రాబాద్ వీధులన్నీ పసుపు తోరణాలు, భారీ ఫ్లెక్సీలతో సుందరంగా అలంకరించాలని తీర్మానించారు. ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా, కార్యకర్తల ఉత్సాహం ఉట్టిపడేలా ఈ ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో తడక వినోద్, కాసుల సుదర్శన్‌రెడ్డి, జి.అనిల్‌కురుమ, శ్యాంసుందర్, భానుప్రకాష్, కరణం కిరణ్, పరశురామ్, మల్లిఖార్జున, సాయి, సుక్రవేది, ఏబిఆర్ మోహన్, వంశీకృష్ణ, ఓ.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని రాకతో ఇంటింటికి కరపత్రాలు, వాల్ రైటింగ్ కార్యక్రమం



ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేస్తున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు

కెపిహెచ్‌బి కాలనీ, మే 6, ప్రభాతవార్త
భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా తెలంగాణకు విచ్చేసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్న నేపథ్యంలో, మే 10వ తేదీ ఆదివారం సాయంత్రం 4.00 గంటలకు సికింద్రబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ కూకట్‌పల్లి డివిజన్‌లో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటికి కరపత్రాలు అందజేస్తూ వాల్ రైటింగ్ చేపట్టారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు స్వయంగా గోడపై పార్టీ గుర్తు చిత్రీకరించి (వాల్ రైటింగ్ చేసి) ప్రజలను సభకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో తెలంగాణకు మరింత అభివృద్ధి దిశగా కొత్త ప్రాజెక్టులు ప్రారంభం కానున్నాయని తెలిపారు.ప్రజలందరూ పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని, ఈ కార్యక్రమం తెలంగాణ అభివృద్ధికి మైలురాయిగా నిలుస్తుందని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు హర్షణపల్లి సూర్యారావు, సెంట్రల్ ఫిలిం బోర్డ్ మెంబర్ దేశబత్తుల సుధా రవి, కూకట్ పల్లి నియోజకవర్గ నాయకులు సురేందర్ రెడ్డి, కర్క దాకయ్య, మల్లేష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, ఐలయ్య యాదవ్, శివరంజని, మల్లేష్, రూప,బిజెపి కార్యకర్తలు, టీం వి.ఆర్.ఆర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బోయిన్‌పల్లి మార్కెట్‌లో కనీస సౌకర్యాలు మెరుగుపర్చాలి : ఎంపి ఈటల రాజేందర్

బోయిన్‌పల్లి కూరగాయల మార్కెట్‌లో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎంపీ ఈటెల రాజేందర్

కంటోన్మెంట్,మే 6 ప్రభాతవార్త: ప్రభుత్వ పరంగా జరిగే కార్యక్రమాలు జరిగినప్పుడే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాలని, ఆ సమయంలో అధికారులు ప్రజల వద్దకు వెళ్లినప్పుడు సమస్యలు వేగవంతంగా పరిష్కారం అవుతాయని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ తెలిపారు. సికింద్రాబాద్ బోయిన్‌పల్లి మార్కెట్‌లో నిర్వహించిన ప్రజా పాలన,రైతు వారం కార్యక్రమానికి బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశంలో అతి పెద్ద మార్కెట్ యార్డుగా అవతరించిన బోయిన్‌పల్లి మార్కెట్‌లో రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు, టాయిలెట్స్,పారిశుద్ధ్యం వంటి కనీస సౌకర్యాలు లేక రైతులు,హమాలీలు,సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మార్కెట్‌లో పేరుకు పోయిన చెత్తా చెదారం,దుర్గాందాన్ని తొలగించాలని 3 గంటల పాటు ధర్నా నిర్వహించి రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్ దృష్టికి తెచ్చామని, వాటి పరిష్కారానికి రూ.10 కోట్లు ఇవ్వమని ప్రాదేయపడ్డా పరిష్కారం కాలేదన్నారు. మార్కెట్‌లో పనిచేసే వారిని,రైతులను సక్రమంగా చూసుకోవాలని అధికారుల దృష్టికి తెచ్చామన్నారు. కాంటాలో, కూరగాయల విక్రయాల్లో,ధరలలో మోసాలు జరగకుండా చూడాలన్నారు. హమాలీల సమస్యలను పరిష్కరించాలన్నారు. మార్కెట్‌లో దోమల బెడద లేకుండా చేయాలన్నారు. మార్కెట్‌లో విశ్రాంతి గదులు,టాయిలెట్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ఆర్.ఆనంద్ బాబు గౌడ్,కార్యదర్శి వెంకటేశం, యూనియన్ నాయకులు సోమ దేవేందర్ రెడ్డి, మల్లికార్జున్, ప్రభాకర్, రాము, అస్లాం, ఆకాశ్ రెడ్డి, బిజెపి నాయకులు బానుక మల్లికార్జున్, పిట్లనాగేశ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అక్రమార్కులపై చర్యల్లో పక్షపాతం ఎందుకు? : ఆకుల సతీష్

అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న ఆకుల సతీష్

నిజాంపేట్, మే 6, ప్రభాతవార్త
బాచుపల్లి మండలం పరిధిలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై అధికారులు పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని సామాజిక కార్యకర్త ఆకుల సతీష్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ సర్వే నెంబర్ 454లో ప్రభుత్వ భూమిని ఆక్రమించి సుమారు 300 గజాలను రోడ్డుగా వినియోగిస్తున్న ఆకృతి కన్స్ట్రక్షన్‌పై ఇప్పటివరకు క్రిమినల్ కేసు నమోదు చేయకపోవడం, ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తున్నదని ఆయన పేర్కొన్నారు.అదేవిధంగా, సర్వే నెంబర్ 83గా చూపిస్తూ ఆస్ట లుమియా స్కూల్ నిర్మాణానికి అనుమతులు తీసుకున్నప్పటికీ, వాస్తవానికి సర్వే నెంబర్ 82లోని సుమారు 20 గుంటల ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణం చేపట్టారని తెలిపారు. దీనిపై అధికారులు నోటీసులు జారీ చేసినప్పటికీ, ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు.పక్కనే ఉన్న మరో ఆక్రమణపై మాత్రం వెంటనే క్రిమినల్ కేసు నమోదు చేసిన అధికారులు, ఆకృతి కన్స్ట్రక్షన్ విషయంలో ఎందుకు అదే విధంగా వ్యవహరించడం లేదని ప్రశ్నించారు. రాజకీయ, ఆర్థిక అండదండలు ఉన్నవారిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు కాలయాపన చేస్తున్నారనే అనుమానం వ్యక్తం చేశారు. సర్వే నెంబర్ 454 మొత్తానికి ఫెన్సింగ్ వేయాలని రెవెన్యూ అధికారులు జనవరిలో హైడ్రాకు లేఖ రాసినప్పటికీ, ఇప్పటివరకు ఫెన్సింగ్ పనులు ప్రారంభం కాలేదని పేర్కొన్నారు. ఇదే విధంగా, సర్వే నెంబర్ 83లో 2700 గజాల్లో స్కూల్ నిర్మాణానికి అనుమతులు తీసుకొని, సర్వే నెంబర్ 82లో సుమారు 2200 గజాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణం పూర్తి చేసి స్కూల్ ప్రారంభించారని ఆరోపించారు.అప్పటి ఎమ్మార్వో, మున్సిపల్ అధికారుల సహకారంతోనే ఈ అక్రమ నిర్మాణం పూర్తయిందని ఆయన ఆరోపించారు. ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు ఫిబ్రవరిలో నోటీసులు ఇచ్చినా, ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం తీవ్ర నిర్లక్ష్యమన్నారు.ఈ నేపథ్యంలో అక్రమార్కులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకుని, ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ప్రజా అవసరాలకు వినియోగించాలని ఆకుల సతీష్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఈశ్వర్ రెడ్డి, పాండు, ఎల్ల స్వామి, హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోడీ సభను విజయవంతం చేస్తాం

-మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమలి ఆనంద్,రాజలక్ష్మి.

బేగంపేట మే 6,ప్రభాతవార్త
సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో ఈ నెల 10వ తేదీన జరగనున్న ప్రధాని మోదీ సభను విజయ వంతం చేస్తామని సికింద్రాబాద్ మహంకాళీ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమలి ఆనంద్,బేగంపేట బీజేపీ కంటెస్టెడ్ కార్పోరేటర్ రాజలక్ష్మి ఆనంద్‌లు తెలియజేసారు.ప్రధాని నగరానికి రాక సందర్బంగా నెమలి ఆనంద్,రాజలక్ష్మిల ఆధ్వర్యంలో ప్రధానికి స్వాగతం పలుకుతూ భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసారు. గోడ రాతలను రాసారు.ఆనంద్ స్వయంగా కమలం పువ్వును గోడ మీద వేయడం ప్రత్యేకంగా నిల్చిం ది.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ఇటీవల మూడు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ కైవసం చేసుకోవడం క్యాడర్ లో ఎంతో జోష్ నింపుతుందన్నారు. తెలంగాణాలో బీజేపీ అధికారమే లక్ష్యంగా కాషాయ శ్రేణులు కదం తొక్కాలని,ప్రధానికి ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వారు తెలియజేసారు.

ప్రసన్నాంజనేయ స్వామివారి దేవస్థానంలో జీర్ణోద్ధరణ ప్రతిష్ట మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

యూసుఫ్‌గూడ మే 6 ప్రభాతవార్త :
ఎర్రగడ్డ డివిజన్ పరిధిలోని హైమావతినగర్ శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి వారి దేవస్థాన ప్రాంగణంలో దేవాదాయ ధర్మాదాయశాఖ శ్రీ దత్తాత్రేయ స్వామివారి జీర్ణోద్ధరణ ప్రతిష్ట మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి గుమ్మడిదల సుధాకర్ తెలిపారు. ఈ నెల 7వ తేదీ గురువారం నుంచి 9వ తేదీ శనివారం వరకు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 7వ తేదీ గురువారం ఉదయం నుంచే గణపతి పూజ, పుణ్యాహ వచనం, యాగశాల ప్రవేశం, మంటపారాధన, కలశస్థాపన, అఖండ స్థాపన, నీరాజన మంత్ర పుష్పములు, 8వ తేదీ శుక్రవారం మంటప దేవత పూజలు, ఆధివాసములు, విశేష హోమములు, 9వ తేదీ శనివారం గర్తాన్యాసములు, విశేష హోమములు, యంత్ర విగ్రహ ప్రతిష్ట, కళాన్యాసములు, మహాకుంబాబి షేకము, మహా పూర్ణాహుతి, ఆశీర్వచనములు తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు శ్రీశ్రీశ్రీ దత్త విజయానంద తీర్థ స్వామిజి వారి తరకమలాతులచే శ్రీ దత్తాత్రేయ స్వామి వారి జీర్ణోద్ధరణ ప్రతిష్ట కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరపడనున్నాయి. ఆలయ సంపూర్ణ నిర్మాణ దాతులుగా డాక్టర్ ఎల్ భరత్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ ఎల్ సుస్మిత దంపతులచే నిర్వహించనున్నారు

అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కృష్ణారావు

కెపిహెచ్‌బి కాలనీ, మే 6, ప్రభాతవార్త
కెపిహెచ్‌బి కాలనీ డివిజన్ పరిధిలోని 4వ ఫేస్‌లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు 16 లక్షలతో చేపట్టనున్న వాటర్ వర్క్స్ అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మందాడి శ్రీనివాస్ రావు, స్థానిక నాయకులు రాజేష్ రాయ్, వెంకట రెడ్డి, సురేష్, ఆనంద్, భవాని, భారతి, కృష్ణా నాయక్, ప్రసాద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.కూకట్‌పల్లి డివిజన్లో కోటి 25 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం. కూకట్‌పల్లి డివిజన్ సాయి బాబా నగర్ కాలని, ఎవిబి పురంలలో సిసి రోడ్స్ 50లక్షలు, ప్రశాంత్ నగర్ కమాన్ సెంటర్ మీడియన్ పనులు 75లక్షలు మొత్తము కలిపి 1కోటి 25 లక్షల రూపాయలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసారు.ఈ కార్యక్రమములో మాజీ కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, ఆవుల రవీందర్ రెడ్డి, స్థానిక నాయకులు సంతోష్, ప్రభాకర్, విష్ణు, ప్రదీప్, రమణ, శంకర్, వెంకట్రావు. గిరి, మోహన్, చైతన్య, మహేష్, పవన్, శ్రీధర్ రెడ్డి, కృష్ణా తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా బండి రమేష్

కెపిహెచ్‌బి కాలనీ, మే 6, ప్రభాతవార్త
తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన టిపిసిసి ఉపాధ్యక్షులు బండి రమేష్ నియమితులయ్యారు. తెలంగాణ ప్రభుత్వం కార్పొరేషన్ చైర్మన్‌లను వైస్ చైర్మన్‌లను నియమిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఇందులో భాగంగా బండి రమేష్‌ను కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమిస్తూ సిఎస్ రామకృష్ణారావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బండి రమేష్ కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులు అవడం పట్ల కమ్మ సామాజిక వర్గం హర్షం వ్యక్తం చేశారు.

గుంజ రేణుకకు అభినందనల వెల్లువ

నిజాంపేట్, మే 6, ప్రభాతవార్త
వడ్డెర కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికైన గుంజ రేణుకకు అభినందనల వెల్లువెత్తాయి. బుధవారం వడ్డెర కార్పొరేషన్ చైర్మన్‌గా గుంజ రేణుక ఎన్నిక కావడంపై అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మెడిటేషన్ కుంచపు రమ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమెకు బుధవారం శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ వడ్డెర సమాజానికి చెందిన నిరుపేదలను గుర్తించి వారికి అండదండగా నిలుస్తూ, వారి అభ్యున్నతి కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు. వడ్డెరలకు న్యాయం జరిగే విధంగా అవసరమైన అన్ని జీవోలను ప్రభుత్వం ద్వారా అమలు చేయించే లా చర్యలు తీసుకోవాలని కోరారు. వెనుకబడిన వడ్డెర కులాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ సమాజంలో మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

క్రీడల ద్వారానే శారీరక, మానసిక ఎదుగుదల : మాజీ డిసిసి అధ్యక్షులు కె.ఎం.ప్రతాప్

కుత్బుల్లాపూర్, మే 6 ప్రభాతవార్త
క్రీడలపై యువత ప్రత్యేకశ్రద్ద కనబర్చి శారీరక మానసిక వికాసానికి ప్రత్యేకశ్రద్ద చూపాలని రంగారెడ్డిజిల్లా మాజీ జిల్లాకాంగ్రెస్ అధ్యక్షులు కె.ఎం.ప్రతాప్ పిలుపునిచ్చారు. బుధవారం కుత్బుల్లాపూర్ గ్రామంలో ఎన్.ఎన్. క్రికెట్‌జోన్‌ను ఆయన నూతనంగా ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా నిర్వాహకులు నార్లకంటి నవీన్, నర్సింగ్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేశారు.ఈసందర్భంగా కె.ఎం.ప్రతాప్ మాట్లాడుతూ యువత క్రికెట్‌పట్ల చూపిస్తున్న ఆసక్తికి అనగుణంగా మెళకులను నేర్పడంతోపాటు జిల్లా, రాష్ట్రస్థాయిలతోపాటు జాతీయస్థాయిలో కుత్బుల్లాపూర్‌కు గుర్తింపు తేవాలని సూచించారు.యువకులు క్రికెట్‌లో ప్రావీణ్యం పొందేందుకు ఎన్.ఎన్.క్రికెట్‌జోన్‌ను వినియోగించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో నార్లకంటి నరసింహ్మా, నార్లకంటి శ్యామ్, పెద్దశంకర్, నార్లకంటి చిన్నశంకర్ తదితరుల ఆధ్వర్యంలో క్రికెట్‌ప్రాముఖ్యతను వివరించారు.

త్యాగరాయ గానసభలో బుర్రకథ సప్తాహం

చిక్కడపల్లి మే 6 (ప్రభాతవార్త) : చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయ గానసభ వ్యవస్థాపకులు, మాజీ అధ్యక్షులు కళా సుబ్బారావు జయంతిని పురస్కరించుకుని నేటి నుండి 13 వ తేదీ వరకు వారం రోజుల పాటు బుర్రకథ సప్తాహం కార్యక్రమాలు నిర్వహించబోతున్నట్లు గానసభ అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్ధన మూర్తి వివరించారు. త్యాగరాయ గానసభ , తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతిరోజూ సాయంత్రం ఆరు గంటలకు గానసభ ఆవరణలోని గుండవరపు హనుమంతరావు కళా వేదికలో బుర్రకథ సప్తాహం ఉంటుంది. 7న రెంజర్ల ప్రభాకరస్వామి బృందం చే శ్రీనివాస కళ్యాణం, 8న చౌక్ లింగం బృందం చే భక్త మార్కండేయ, 9 న సక్కా ఉప్పలయ్య బృందం చే సీతా కళ్యాణం, 10 న సాలం కృష్ణయ్య బృందం చే పార్వతీ కళ్యాణం, 11 న గడ్డం అర్జున్ బృందం చే కొండల రాయుడు, 12 న జనార్దన్ బృందం చే బ్రహ్మం గారి సమాధి ఘట్టం, 13 న చిట్టిమెట్టి ఆంజనేయులు బృందం చే సత్య హరిశ్చంద్ర అంశాలపై బుర్రకథ ఉంటుందన్నారు. కళాభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో విచ్చేసి ఈ సాంస్కృతిక కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

చిరు వ్యాపారులకు అండగా ట్రాఫిక్ ఏఎస్సై శ్యామల

రోడ్డు పక్కన పూలు అమ్ముకుంటున్న కొమురమ్మకు గొడుగు అందిస్తున్న ఏఎస్సై శ్యామల.

బేగంపేట మే 6,ప్రభాతవార్త : రోడ్లపై ఎర్రటి ఎండ,వర్షాలకు తడుస్తూ పూలు, పండ్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న మహిళలు,పంక్చర్ షాపు నిర్వహించుకునే వారికి ఎండా, వానల నుంచి రక్షణగా గొడుగులు అందజేస్తూ వారికి అండగా నిలుస్తున్నారు బేగంపేట ట్రాఫిక్ ఏఎస్సై శ్యామల. బేగంపేట ట్రాఫిక్ పోలీసుస్టేషన్ లో విధులు నిర్వర్తిస్తున్న ఏఎస్సై తాను విధులు నిర్వర్తించే ప్రాంతాలలో రోడ్లపై ఎండకు ఎండతూ, వానకు తడుస్తూ ఉండే మహిళలకు గొడుగులు అందించి వారికి ఉపశమనం కల్గిస్తున్నారు.బేగంపేట పరిధిలోని వివిధ ప్రాంతాల్లో మహిళలకు శ్యామల గొడుగులు అందజేసారు. రసూల్‌పురా లో నివసించే కొమురమ్మ భర్త మల్లయ్య మృతి చెందడంతో ఆమె సింధు కాలనీలో పూలు అమ్ముకుంటూ తన కుటుంబాన్ని పోషించుకుంటుంది.కొడుకు కూడా పూలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంటాడు.ఆమెకు ఏఎస్సై గొడుగు అందజేయడంతో కొమురమ్మ ఎంతో సంతోషపడింది. బేగంపేట కట్టమైసమ్మ అమ్మ వారి ఆలయం ముందు భగవంతాపూర్‌కు చెందిన రాజేశ్వరి రాజశేఖర్ లు భార్యా భర్తలు. రాజశేఖర్ కూలి పనులు చేస్తుండగా,రాజేశ్వరి కట్టమైసమ్మ అమ్మ వారి ఆలయం ముందు పూలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంది.రాజేశ్వరికి ఎండ,వానల నుంచి రక్షణగా ఏఎస్సై శ్యామల గొడుగు అందించింది.ఇదే ప్రాంతంలో ఫతేనగర్ లింక్ రోడ్డు పక్కన ఫుట్ ఫాత్ పై పంక్చర్ షాపు నిర్వహించుకుంటున్న వ్యక్తికి కూడా శ్యామల గొడుగు అందించింది.తమకు ఎండల నుంచి ఏఎస్సై గొడుగులు అందించడం సంతోషంగా ఉందని వారు సంతోషం వ్యక్తం చేసారు.శ్యామల ఒక వైపు క్రీడలలో తన ప్రతిభను ప్రదర్శిస్తూనే ఇలాంటి సామాజిక కార్యక్రమాలు నిర్వహించడాన్ని పలువురు అభినందిస్తున్నారు.

బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో తలసాని దంపతుల ప్రత్యేక పూజలు

అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న తలసాని దంపతులు

సంజీవరెడ్డి నగర్, మే 6, ప్రభాతవార్త: మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తన భార్య స్వర్ణతో కలిసి బుధవారం తమ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయానికి చేరుకున్న దంపతులకు ఆలయ చైర్మన్ సాయిబాబా గౌడ్ ఆధ్వర్యంలో పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించగా, పూజల అనంతరం వేదమంత్రాలతో ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, సనత్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొలన్ బాల్ రెడ్డి, హన్మంతరావు, సురేష్ గౌడ్, ప్రవీణ్ రెడ్డి, అశోక్ యాదవ్, నర్సింహ, కట్టా బలరాం, గుడిగే శ్రీనివాస్ యాదవ్, జితేందర్ శుక్లా తదితరులు పాల్గొన్నారు. వారు తలసాని దంపతులను శాలువాలతో సత్కరించి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ, తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రజాసేవలో ఎల్లప్పుడూ ముందుండి పనిచేస్తూ ప్రజల ఆదరణ పొందుతున్నారని కొనియాడారు.

డబుల్‌బెడ్‌రూమ్స్‌లలో జోనల్ కమిషనర్ ఆకస్మిక పర్యటన

కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్(ఐఎఎస్)కు వినతిపత్రం సమర్పిస్తున్న కైసర్‌నగర్ డబుల్‌బెడ్‌రూమ్ వాసులు

కుత్బుల్లాపూర్, మే 6 ప్రభాతవార్త
గాజులరామారం సర్కిల్ కైసర్‌నగర్ డబుల్‌బెడ్‌రూమ్ వాసుల సమస్యలపై కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేశ్‌కుమార్ (ఐఎఎస్) ఆకస్మికంగా పర్యటించారు. బుధవారం కైసర్‌నగర్ డబుల్‌బెడ్‌రూమ్స్ నివాసితులు ఎదుర్కొంటున్న సమస్యసత్వర పరిష్కార చర్యలను చేపట్టాలని ఆయన సంబందిత అధికారులను ఆదేశించారు. ఈమేరకు ఆయనకు స్థానిక 2బిహెచ్‌కె డిగ్నిటీ హౌసింగ్‌ఫ్లాట్ ఓనర్స్ మెయింటెనెన్స్‌మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటీ సొసైటీ ఆధ్వర్యంలో ఇచ్చిన ఫిర్యాదులకు గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ శ్రీపాద రామేశ్వర్,టౌన్‌ప్లానింగ్ అధికారి సుమిత్రభాయ్‌లతో కలిసి పర్యటించి సమస్యలను పరిశీలించారు.. ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదులకు ఆయన స్పందించారు. ఈసందర్భంగా స్థానికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు టెర్రస్‌వర్క్, నీళ్లబోర్‌కోసం, పిల్లల పార్కుకాంపౌడ్‌గోడ నిర్మాణం, ఎస్.టి.పి వాటర్ అవుట్‌లెట్ తదితర సమస్యలపై తక్షణం చర్యలు చేపట్టనున్నట్లు వారికి హామీఇచ్చారు. సొసైటీ ముఖ్య సలహాదారులు షేక్ సాజిద్‌చౌష్; ఎండి.అతీక్‌రెహమాన్, చైర్మెన్ సాధుల వేణు, వైస్‌చైర్మెన్ బ్రహ్మనాయుడు, ప్రధానకార్యదర్శి మోహన్‌రెడ్డి, సహాయ కార్యదర్శి సయ్యద్ షఫీ, శ్రీనివాస్, కోశాధికారి ఖయ్యూంల ఆధ్వర్యంలో జోనల్‌కమిషనర్ పింకేశ్‌కుమార్‌ను కలిసారు. తాము గతంలోనూ ప్రజావాణిలో కైసర్‌నగర్ డబుల్‌బెడ్‌రూమ్‌ల నివాసితులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ఈసందర్భంగా జోనల్‌కమిషనర్ పింకేశ్‌కుమార్ మాట్లాడుతూ సత్వరం గాజులరామారం కైసర్‌నగర్ డబుల్ బెడ్‌రూమ్‌ల నివాసితులు ఎర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంబంధిత వివిధ విభాగాల అధికారులతో పర్యటించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీఇచ్చారు.

10న రంగనాథస్వామి దేవాలయంలో గరుడ ప్రసాద పూజ

కార్వాన్,మే6(ప్రభాతవార్త)
జియాగూడ డివిజన్ పరిధిలో కొలువు దీరిన మహిమాన్విత రంగనాథస్వామి దేవాలయంలో శ్రీ రంగనాథ స్వామి కృపతో జరుగు గరుడ ప్రసాద (సంతానం కోసం) పూజా కార్యక్రమం ఈ నెల10 తేదీన జరుపనున్నామని ఆలయ పూజారి శృంగారం బద్రి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భముగా వారు మాట్లాడుతూ..జియాగూడలోని శ్రీ రంగనాథస్వామి ఆలయంలో 10న ఆదివారం ,ఉదయం 8 నుండి 1 వరకు జరిగే గరుడ ప్రసాద కార్యక్రమానికి (సంతానం కోసం) భక్తులందరూ తప్పక హాజరై స్వామి కృపకు పాత్రులు కావలసిందిగా కోరారు.

జెఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్లకు మరమ్మతులు చేపట్టాలి

పెచ్చులు ఊడిన ఇళ్లను పరిశీలిస్తున్న గుర్రం పవన్‌కుమార్‌గౌడ్

సికింద్రాబాద్, మే 6 ప్రభావార్త: హమాలీబస్తీలో శిథిలావస్థకు చేరుతున్న జెఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్లకు ప్రభుత్వం వెంటనే మరమ్మతులను చేపట్టాలని బీఆర్ఎస్ పార్టీ పద్మారావునగర్ ఇంచార్జి గుర్రం పవన్ కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. హమాలీబస్తీలో మంగళవారం బ్లాక్ వన్ లోని పలు ఇళ్ల స్లాబ్ పెచ్చులు ఊడి పడుతుండటంతో స్థానికులు ఆందోళనకు గురై పవన్‌కుమార్‌కు సమాచారం అందించారు. వెంటనేసంఘటన స్థలానికి చేరుకున్న పవన్ కుమార్ పెచ్చులూడిన ఇళ్లను పరిశీలించారు. వెంటనే ఈ విషయం ముషీరాబాద్ ఇంచార్జ్ తహసీల్దార్ చందన దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయం పై టెక్నికల్ టీంను పంపి ఇళ్ల యొక్క నాణ్యతపై నివేదిక రూపొందించి హైదారాబాద్ కలెక్టర్‌కు సిఫ్పార్సు చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బస్తి అధ్యక్షులు సుభాష్ ,సత్యనారాయణ, రవి, అంబులెన్సు సురేష్, కుషాల్ కౌసల్య వెంకట్ ముక్క శ్రీనివాస్ పాల్గొన్నారు.

హ్యాండ్లూమ్ కార్పొరేషన్ లిమిటెడ్ వైస్‌చైర్మన్‌గా జక్కని అనిత

అత్తాపూర్ మే6 , ప్రభాతవార్త :
తెలంగాణ హ్యాండ్లూమ్ కార్పొరేషన్ లిమిటెడ్ వైస్ చైర్మన్‌గా జక్కని అనిత నియమితులయ్యారు. పద్మశాలి సమాజానికి చెందిన ఆమె, 2010 సంవత్సరం నుండి కాంగ్రెస్ పార్టీకి నిస్వార్థంగా సేవలు అందిస్తూ వస్తు న్నారు. బుధవారం జక్కని అనిత మాట్లాడుతూ... సిఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లు తనను గుర్తించి తెలంగాణ హ్యాండ్లూమ్ కార్పొరేషన్ లిమి టెడ్ వైస్ చైర్మన్‌గా నియమించడం సంతోషంగా ఉందని హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారుతనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన మీనాక్షి నటరాజన్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.హ్యాండ్లూమ్ రంగ అభివృద్ధికి, ముఖ్యంగా పద్మశాలి సంక్షేమానికి, సంప్రదాయ వృత్తిని ఆధునిక మార్కెట్‌కు అనుగుణంగా అభివృద్ధి చేయడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

రక్తదాతలను అభినందించిన చిరంజీవి

జూబ్లీహిల్స్, మే 6, ప్రభాతవార్తః
చిరంజీవి రక్తనిధి కేంద్రం ద్వారా అత్యధికంగా రక్తదానం చేసిన ఇద్దరు దాతలను సినీనటుడు, చిరంజీవి ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ చిరంజీవి ప్రత్యేకంగా అభినందించారు. చిరంజీవి రక్తనిధి కేంద్రంలో 83 సార్లు రక్తదానం చేసిన కె. రవితేజ, 84సార్లు రక్తదానం చేసిన పి. శంకర్‌రెడ్డి రక్తదానం చేశారు. ఈ మేరకు ఇద్దరు దాతలను ప్రత్యేకంగా అభినందిస్తూ చిరంజీవి వారికి లేఖలు రాశారు. మానవత్వాన్ని పరిమళింపజేస్తూ, సామాజిక బాధ్యతతో తన వెంట నడుస్తున్నందుకు ఆయన వారిని అభినందించారు. రక్తదానం ఎంతో మందికి ప్రాణదానంగా నిలుస్తుందన్నారు. ఈ రక్తసంబంధం ఇలానే కొనసాగాలంటూ ఆయన లేఖలో దాతలను అభినందించారు.

తెలంగాణ ప్రభుత్వం
సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

NIT No. 04/EE-56/QBZ/CMC/2026-27, NIT No. 02/EE-59/QBZ/CMC/2026-27 & NIT No. 03/EE-60/QBZ/CMC/2026-27, తేది: 06.05.2026 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫారంపై ప్రచురింపబడింది.
https://tender.epeocurement.gov.in వద్ద లాగింగ్ ద్వారా వివరాలు చూడవచ్చును. ఈవెంట్స్ తేదీలు క్రింద వివరింపబడినవి. సెట్ నం: పైన పేర్కొనబడినది. పనిపేరు : 1. బిటి రోడ్స్-1 పని. 2. 1. చైన్ లింక్ మెష్ వేయుట-1 పని. 2. వీధి దీపాల నిర్వహణకు LED డ్రైవర్స్ యొక్క సేకరణ-1 పని. 1. వీధి దీపాల నిర్వహణకు కేబుల్, LED లైట్స్ యొక్క సేకరణ-1 పని. 2. నీటి సరఫరా యొక్క మరమ్మతు మరియు నిర్వహణ- 2 పనులు. 3. సిసి రోడ్- 1 పని. అంచనా మొత్తం లక్షలలో : 1. 40.00. 2. 7.00. 3. 47.73. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ, సమయం/బిడ్ దాఖలు ముగింపు తేదీ, సమయం: మూడింటికీ ఒకటే 08.05.2026 మ.12.00గం. నుండి 15.05.2026 మ.12.00గం.కు. అధికారి పేరు, చిరునామా, సెల్ నెం: EE సర్కిల్-56, 59 & 60, CMC, కుత్బుల్లాపూర్, సెల్ నం.: 7995468066, 7331181426. సంబంధిత అధికారి చిరునామా: శ్రీ సుబ్రమణ్య SVRNRD, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, 56-కొంపల్లి, 59-దుండిగల్ & 60- మేడ్చల్, కుత్బుల్లాపూర్ జోన్, CMC. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ https://tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-56, 59 & 60, QBZ,CMC.
DIPR.NO. 2022-PP/CL/ADVT/1/2026-27 తేదీ: 06.05.2026

(BY ORDER OF THE HON'BLE PRINCIPAL JUDGE, FAMILY COURT - CUM - XIII ADDL. METROPOLITAN SESSIONS JUDGE, AT HYDERABAD)
IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUDGE, FAMILY COURT - CUM - XIII ADDL. METROPOLITAN SESSIONS JUDGE, AT HYDERABAD
E.P. NO. 13 OF 2025
IN
ORDER DATED 27.11.2024 PASSED IN O.P. NO. 1746 OF 2023
Between:
Dr. Gorripati Pushyami, D/o G. Ramesh, aged about 35 years, Occ: Graduate, R/o H. No. 8-3-236/2/3/, C 102, Dream Home Harmony, Beside Savera Function Hall, Yousufguda, Hyderabad - 500045
... Decree Holder
AND
1. Pavuluri Murali Chowdary, S/o Basavaiah Choudary, aged about 38 years, Occ: Business, R/o Flat No. 2811, 28th Floor, Sumadura Acropolis, Nanakramguda, Hyderabad - 500032
...Respondent No. 1 / Judgement Debtor
2. Assistant Commissioner of Income Tax, Central Circle - 2 (1), I.T. Towers, A.C. Guards, Masab Tank, Hyderabad, Telangana - 500004
...Respondent No. 2/Garnishee
NOTICE
To,
Pavuluri Murali Chowdary
Kindly take notice that the above said Decree Holderhadfiled an Execution Petition vide E.P. No. 13 of 2025 in order dated 27.11.2024 passed in O.P. No. 1746 of 2023. The said execution petition was filed seeking execution of the order dated 27.11.2024 passed by the Hon'ble Principal Judge, Family Court cum XIII Additional Metropolitan Sessions Judge, Hyderabad in O.P. No. 1746 of 2023. As such any interested parties including the Judgement Debtor i.e., Pavuluri Murali Chowdary who have any claims in relation to the E.P. No. 13 of 2025 are directed to appear before the Hon'ble Court on08.06.2026 at 10:30 a.m. either in person or through a Counsel. If the interested parties fail to appear on the said date, the matter will be decided accordingly.
VINAMRA GOGIA
Advocate
Flat No. 304, Street No. 7, Highness Residency, Himayathnagar, Hyderabad - 500029
Mob: +91 7702761572

IN THE COURT OF THE HON'BLE III ADDL. JUNIOR CIVIL JUDGE MEDCHAL MALKAJGIRI DISTRICT, AT KUSHAIGUDA
O. S. No. 413/2026
Between:-
1. Gudikada Nirmala, W/o. Late Gudikada Nandam @ Nandam Chary
2. Gudikada Suresh Chary, S/o. Late Gudikada Nandam @ Nandam Chary
3. Gudikada Bhanu Priya, D/o. Late Gudikada Nandam @ Nandam Chary
4. Gudikada Lavanya @ Bongurala Ramya Sree, D/o. Late Gudikada Nandam @ Nandam Chary
...Plaintiffs
AND
1. The Tahsildar, Malkajgiri Mandal
2. All concerned
...Defendants
Please take notice that the above-named Plaintiffs have filed the above O. S. No. 413/2026 to declare the Plaintiffs as the legal heirs of GUDIKADA NANDAM @ NANDAM CHARY who passed away on 04.11.2000. The above suit has been filed against the Defendant No. 1 and all concerned and the matter is posted to 20.06.2026 for the appearance of all concerned i.e., the Defendant No. 2 and their counter, if any. Therefore, if any person/s has/have objection/s, they may appear before this Court on 20.06.2026 at 10.30 A.M. either in person or through an Advocate, duly instructed by any concerned along with relevant documentary evidence, failing which the matter will be decided on merits.
//By Order of the Court//
AJAY KUMAR BOBBALA
JYOTHIRMAI BOBBALA
Advocates
Office at H.No. 30-57/5, Ganesh Nagar Old Safil Guda, Malkajgiri, Hyderabad.
Contact: 9550703060

పెట్రోల్, నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించాలి

హయత్‌నగర్లో నిరసన తెలుపుతున్న నాయకులు

ఆర్.ఎన్.ఆర్ కాలనీ చౌరస్తాలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

హయత్ నగర్, మే 6 ప్రభాతవార్త :
పెంచిన పెట్రోల్, డీజిల్, నిత్యావసర ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్రచారి, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి డిమాండ్ చేశారు. ధరల పెరుగుదలలో కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ హయత్ నగర్, రావినారాయణ రెడ్డి కాలనీ చౌరస్తాలో సీపీఐ నాయకులు కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కేంద్రం కార్పొరేట్ శక్తులకు అండగా ఉంటూ సామాన్య మధ్య తరగతి ప్రజల పొట్టకొడు తోందన్నారు. యుద్ధాన్ని సాకుగా చూపుతూ నిత్యావసర వస్తువుల ధరలను పెంచడం దారుణమన్నారు. ప్రభుత్వం బడా బాబులకు మద్దతుగా నిలుస్తూ పేదలపై భారాన్ని మోపుతోంద న్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలుపు తుంటే పోలీసులతో అడ్డంకులు సృష్టించడం దారుణమన్నారు.ప్రజా ఉద్యమాలను అణిచి వేయాలని చూస్తే మరింత రెట్టింపు ఉత్సాహంతో ముందుకు సాగుతామన్నారు. కార్యక్ర మంలో నాయకులు శేఖర్ రెడ్డి, హరిసింగ్ నాయక్, పబ్బతి లక్ష్మణ్, కేతారాజు నర్సింహా, దాసరి ప్రసాద్, వంశి వర్ధన్, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమం కోసం అభివృద్ధి కార్యక్రమాలు : చైర్మన్ లక్ష్మి

సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ చెకోలేకర్ లక్ష్మి చిత్రంలో వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, ఇన్చార్జ్ ఎస్జీఎస్ చిలకా నరసింహారెడ్డి, డైరెక్టర్లు ప్రత్యూష, మసరత్ సుల్తానా, ట్రేడర్స్ అధ్యక్షుడు చేగురి వెంకటరమణ

మలక్ పేట, మే 6, ప్రభాతవార్త:
రైతుల సంక్షేమం కోసం పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చెకోలేకర్ లక్ష్మి పేర్కొన్నారు. మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ కార్యాలయంలో ప్రజా పాలన పట్టణ ప్రగతి 95 రోజుల ప్రణాళిక కార్యక్రమాలలో భాగంగా రైతు సమీక్ష సమావేశాలను రైతులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ చెకోలేకర్ లక్ష్మి, వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ లు మాట్లాడుతూ మలక్ పేట్ లో ఉన్న హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ లో ఈ నామ్ ద్వారా రైతుల సంక్షేమ పథకాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని వివరించారు. ఇతర రాష్ట్రాల నుంచి మార్కెట్కు వచ్చే రైతుల కోసం అన్ని వసతులను కల్పిస్తున్నామని తెలిపారు. ఇంచార్జ్ ఎస్జీఎస్ చిలక నర్సింహారెడ్డి మాట్లాడుతూ రైతుల కోసం చలివేంద్రాలు, ఆధునాతన సౌకర్యాలతో టాయిలెట్లు ఏర్పాటు చేయడంతో పాటు, 24 పడకల విశ్రాంతి గదులను ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని మార్కెట్లను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆధునాతనంగా తీర్చిదిదనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్, తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ అధ్యక్షుడు చేగురి వెంకటరమణ, డైరెక్టర్లు ప్రత్యూష మహేష్, మసరత్ సుల్తానా, నేలపాటి రామారావు, బుద్ధా సత్యనారాయణ, కిషన్ సింగ్, అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తుర్కయాంజల్ రైతు సేవా సహకార సంఘం పిక్ కమిటీ సమావేశం

తుర్కయాంజల్ మే 6, ప్రభాతవార్త
తుర్కయాంజల్ రైతు సేవా సహకార సంఘం పిక్ (పర్సన్ ఇంచార్జ్) కమిటీ సమావేశం బుధవారం సంఘ ప్రధాన కార్యాలయంలో జరిగింది. రంగారెడ్డి జిల్లా జాయింట్ రిజిస్ట్రార్, జిల్లా సహకార అధికారి ఉత్తర్వుల మేరకు 14 ఫిబ్రవరి 2025న కమిటీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం, పిక్ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘ ప్రస్తుత వ్యవహారాలపై సమగ్ర సమీక్ష చేపట్టారు. రైతులకు అందుతున్న సేవలు, సంఘ పరిపాలన, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ సమావేశంలో పిక్ కమిటీ సభ్యులు కొత్త రాం రెడ్డి, చెక్క లక్ష్మమ్మ, సామ సంజీవరెడ్డి, కుతడి నర్సింగ్ రావు, వంగేటి లక్ష్మ రెడ్డి, కోంద్రు స్వప్న, చాపల యాదగిరి, శీలం లక్ష్మమ్మ, జక్క కృష్ణ రెడ్డి, సామ సత్యనారాయణ రెడ్డి, సంఘ సెక్రెటరీ వై. రాందాస్ పాల్గొన్నారు.

కాలనీలలో అంధకారం తొలగించిన గణేష్ నేత

కాలనీలో పర్యటిస్తున్న పున్న గణేష్‌నేత

ఎల్.బి.నగర్, మే 6 ప్రభాతవార్త: కాలనీలలో అంధకారం తొలగించేందుకు వీధి దీపాలను ఏర్పాటుచేసి సమస్య పరిష్కరించడం జరిగిందని ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్‌నేత పేర్కొన్నారు. శ్రీరామకృష్ణపురం డివిజన్ ఎస్బిఐకాలనీలో వీధిదీపాలు తెలగకపోవడంతో సమస్యను గురించి కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు గణేష్‌నేత దృష్టికి తీసుకురాగా ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి పాత వీధిదీపాలను తొలగించి ప్రతి చౌరస్తాలో హైవోల్టేజ్ నూతన ఎల్ఈడి లైట్స్ ఏర్పాటు చేయించారు. అదేవిధంగా ఎస్బిఐ కాలనీ రోడ్‌నెంబర్ 2,4లో గుంతలమయంగా మారిన సిసి రోడ్లను, డ్రైనేజ్ మాన్యువల్ సంబంధించిన సమస్య కూడా త్వరలో ఎస్టిమేట్ వేయించి నిధులు మంజూరు చేయిస్తామన్నారు. డివిజన్లోని కాలనీల సమస్యలను మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్‌రావ్, ఎస్బిఐ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కనతాల బిక్షంరెడ్డి, జంగయ్య, ముషం శ్రీనివాస్, పాండురంగారెడ్డి, అనంతరెడ్డి, కిరణ్, వంశీ, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలి : బిజెపి

మలక్ పేట, మే 6, ప్రభాతవార్త:
ఈ నెల 10వ తేదీన నగరంలోని పేరేడ్ గ్రౌండ్స్ లో నిర్వహించనున్న దేశ ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బిజెపి భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొక్క మధుసూదన్ రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్ రెడ్డి, మాజీ కోశాధికారి రమేష్ రెడ్డి, ముసారాంబాగ్ డివిజన్ బిజెపి అధ్యక్షుడు కొప్పుల దినేష్, బీజేవైఎం భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు అనుముల భరత్ లు పేర్కొన్నారు. మూసరాంబాగ్ డివిజన్ బిజెపి అధ్యక్షుడు కొప్పుల దినేష్ ఆధ్వర్యంలో సలీంనగర్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వికసి భారత నిర్మాణానికి కంకణ బద్ధులైన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలి సారి నగరానికి విచ్చేస్తున్నారని తెలిపారు. మలక్ పేట్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలోని కాలనీలు, బస్తీలలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రధాని మోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతున్నామని వివరించారు. ప్రధాని మోడీ బహిరంగ సభకు మలక్ పేట్ నియోజకవర్గ నుంచి సుమారు 3000 మందితో తరలి వెళ్లనట్లు తెలిపారు రానున్న జిహెచ్ఎంసి ఎన్నికలలో మూడు మేయర్ స్థానాలను బిజెపి కైవసం చేసుకుంటుందని, అదేవిధంగా తెలంగాణలో బిజెపి జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. మలక్ పేట్ నియోజకవర్గంలో బిజెపి పార్టీ చాలా బలంగా ఉందని తెలిపారు. భాగ్యనగర్ యువ మోర్చా ఆధ్వర్యంలో ఒక్కొక్క డివిజన్ నుంచి 100 బైక్ లతో భారీ ర్యాలీగా బహిరంగ సభకు తరలివెలనట్లు పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికలలో బిజెపి వెస్ట్ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరిలో విజయం సాధించిందని, ప్రజలు బిజెపి పాలనను కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికలలో తెలంగాణలో బిజెపి విజయం సాధిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. నూతన ఉద్యోగ అవకాశాలను కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని పేర్కొన్నారు. దేశ ప్రధాని మోడీ రాక కోసం నాయకులు, కార్యకర్తలు ఎదురుచూస్తున్నారని, ప్రధాని మోడీకి బ్రహ్మాండంగా స్వాగతం పలుకుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గౌర దేవేందర్, సురేందర్ ,జక్కా మోహన్ రెడ్డి, లక్ష్మి,సునీత పాల్గొన్నారు

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బిజెపి నాయకులు రమేష్ రెడ్డి, సందడి సురేందర్ రెడ్డి, బొక్క మధుసూదన్ రెడ్డి, కొప్పుల దినేష్, అనుమల భరత్ తదితరులు

ఓపెన్ స్థలాలను పార్కులు, క్రీడా స్థలాలుగా అభివృద్ధి చేయాలి : సబితా ఇంద్రారెడ్డి

సరూర్‌నగర్, మే 6 ప్రభాతవార్త: జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలోనున్న ఓపెన్ స్థలాలను పార్కులు, క్రీడా స్థలాలుగా అభివృద్ధి చేసి కబడ్డీ, టెన్నిస్, షటిల్ కోర్టులను ఏర్పాటు చేయడం ద్వారా బాలలకు క్రీడల్లో తర్ఫీదు నివ్వాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి సూచించారు. సర్కిల్ కిందకు వచ్చే మీర్‌పేట్ పెద్ద చెరువు వద్ద క్రీడా మైదానంలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా డిప్యూటీ కమీషనర్ వి.సమ్మయ్య ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ మేరకు ముఖ్య అతిథిగా హాజరైన ఆమె టియుఎఫ్ఐడిసి ఛైర్మన్ చల్లా నర్సింహారెడ్డి తదితరులతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసిన అనంతరం క్రికెట్ బ్యాటు చేతబట్టి ఆడి సమ్మర్ స్పోర్ట్స్ క్యాంపును లాంఛనంగా ప్రారంభించారు. ఆ తర్వాత క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరించిన తర్వాత సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవాటు చేసుకోవడంలో క్రీడలు కూడా కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. సర్కిల్ పరిధిలోని అన్ని పాఠశాలల్లో మైదానాలను సక్రమంగా నిర్వహిస్తూ విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలన్నారు. చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అవసరమేనని ఆమె వ్యాఖ్యానించారు. చెరువుల వద్ద వాకింగ్ ట్రాక్‌లను సక్రమంగా నిర్వహించాలని ఆమె అధికారులకు సూచించారు. పబ్లిక్ ఏరియాల్లో ముఖ్యంగా బస్టాపులు, ఆట స్థలాలు, పార్కుల వద్ద వాష్ రూమ్స్ ఏర్పాటు విషయంపై దృష్టి పెట్టాలని కోరారు. కాగా ఈ సమ్మర్ క్యాంపులో నిర్దేశించిన కబడ్డీ, క్రికెట్, కరాటే, ఖోఖో తదితర వాటిల్లో ఇచ్చే శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సబితారెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ ఇన్స్‌పెక్టర్ సంతోష్, ఎంఎంహెచ్ డాక్టర్ ప్రవీణ్, ఎఇలు గంగా ప్రసాద్, హరీష్, సౌజన్య, పలువురు కోచ్‌లు, విద్యార్థులతో పాటు దీప్‌లాల్ చౌహాన్, అర్కల భూపాల్‌రెడ్డి, చల్లా బాల్‌రెడ్డి, ధనలక్ష్మి రాజ్‌కుమార్, సిద్దాల శ్రీశైలం, ఎనుగుల అనిల్ యాదవ్, అర్కల కామేష్‌రెడ్డి, జమాల్‌పూర్ సునీత బాలరాజ్, మాదరి రమేష్, రామిడి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ స్పోర్ట్స్ క్యాంపును లాంఛనంగా ప్రారంభిస్తున్న సబితా ఇంద్రారెడ్డి

ప్రధాని నరేంద్రమోడి సభను విజయవంతం చేయాలి : ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

సరూర్‌నగర్, మే 6 ప్రభాతవార్త: ఈ నెల 10వ తేదీన సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో బిజెపి ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ప్రధాని నరేంద్ర మోడి బహిరంగ సభను విజయవంతం చేయాలని బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యుడు, చేవెళ్ళ ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మోడి సభ నేపథ్యంలో జన సమీకరణ చేసేందుకు పార్టీ నేతలకు దిశా నిర్దేశనం చేసే నిమిత్తం బుధవారం నాదర్‌గుల్‌లోని మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ నరేంద్ర మోడి సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ శ్రేణులు, పార్టీ సానుభూతిపరులు, అభిమానులు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఇంకా ఈ సమావేశంలో జాతీయ కౌన్సిల్ సభ్యుడు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, రాష్ట్ర పార్టీ కార్యదర్శి తూళ్ళ వీరేందర్‌గౌడ్, జిల్లా బిజెపి అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్, మహేశ్వరం నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, పార్టీ ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్, జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి తదితరుల ప్రసంగించి దిశా నిర్దేశనం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీకి చెందిన రాష్ట్ర, జిల్లా, మండలాలు, డివిజన్ల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మోడీ సభ సందర్భంగా పార్టీ నాయకులకు దిశా నిర్దేశనం చేస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

ప్రజల సౌకర్యాల విషయంలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

-ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

కుషాయిగూడ,మే 6, ప్రభాతవార్త
ప్రజల సౌకర్యాల విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని పార్కులలో భద్రత ఏర్పాట్లలో సైతం చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కాప్రా సర్కిల్, శ్రీనివాస్ నగర్ కాలనీలోని హైటెన్షన్ రోడ్డు వద్ద ఉన్న పార్కును కమిషనర్ ఈరోజు క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పార్కులోని చిన్నారుల ఆట వస్తువుల పరిస్థితిని ఆయన నిశితంగా పరిశీలించారు. కమిషనర్ అధికారులకు జారీ చేసిన ముఖ్య ఆదేశాలు జారీ చేశారు.త్వరితగతిన మార్పు: పాడైపోయిన మరియు విరిగిపోయిన ఆట వస్తువుల స్థానంలో వెంటనే కొత్త వాటిని ఏర్పాటు చేయాలన్నారు.నిర్వహణ: పార్కు పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ, సరైన పద్ధతిలో నిర్వహించాలన్నారు.ప్రజా భద్రత,సందర్శకుల సౌకర్యార్థం మరియు పిల్లల భద్రత దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.పబ్లిక్ సౌకర్యాల విషయంలో నిర్లక్ష్యం వహించకూడదని, పార్కును ప్రజలకు ఆహ్లాదకరంగా మార్చాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాపు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీహరి, డి ఈ బాలకృష్ణ, సానిటరీ ఇన్స్పెక్టర్ సుదర్శన్ ఎస్ఎఫ్ఏ మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఎంఎంసి పరిధిలోని కాప్రా శ్రీనివాస్ నగర్‌లో పర్యటిస్తున్న కమిషనర్ కృష్ణారెడ్డి

కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా సిపిఐ నిరసన

అత్తాపూర్ మే6 ,ప్రభాతవార్త :
యుద్ధం పేరుతో పేద ప్రజలను బిజెపి ప్రభుత్వం దోచుకుంటుందని పలువురు సిపిఐ నాయకులు మండిపడ్డారు. పెట్రోల్ ,డీజిల్ కొరత గ్యాస్ అధిక ధరలను నిరసిస్తూ రాజేంద్రనగర్ మండల కేంద్రంలో బుద్వేల్ చౌరస్తాలో సిపిఐ తెలంగాణ రాష్ట్ర కంట్రోల్ కమిషనర్ సభ్యులు పుస్తకాలు నర్సింగ్ రావు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా సిపిఐ తెలంగాణ రాష్ట్ర కంట్రోల్ కమిషనర్ సభ్యులు పుస్తకాలు నర్సింగరావు ,మండల కార్యదర్శి కన్యగారి నర్సిం హ్మారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పంటల కోత సమయంలో డీజిల్ లేకపోవడం రైతాంగం తీవ్ర ఇబ్బందులకు గురి అవుతుందన్నారు. కొరత లేదని పాలకులు ప్రకటిస్తున్నప్పటికీ ఆచరణలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను పట్టించుకోవడం లేదని వారు విమర్శించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ముగియగానే కేంద్ర ప్రభుత్వం వాణిజ్య సిలిండర్ ధరలను 993 రూపాయలు పెంచడంతో అది కాస్త 3100 కు చేరిందని అలాగే డీజిల్ పెట్రోల్ మీద లీటరుకు 5 రూపాయలు గృహ అవసరాల గ్యాస్ సిలిండర్ ధరపై 50 రూపాయలు పెంచడానికి ఆయిల్ కంపెనీలు ప్రతిపాదనలు పంపించాయని వీటిని కూడా కేంద్ర ప్రభుత్వం పెంచే ప్రమాదం ఉన్నందున ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమించి తిప్పుకొట్టాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ ఎం ఏ రియాజ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు జే ఆనంద్ గౌడ్ మండల సహాయ కార్యదర్శి జె విజయ ఆనంద్ గౌడ్ కార్యాలయం కార్యదర్శి జి సత్యం భారత జాతీయ మహిళా సమాఖ్య ఎన్ఎఫ్ఐడబ్ల్యు ,మండల అధ్యక్షులు మునేశ్వరి ఎఐటియుసి మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ కాజా మండల కౌన్సిల్ సభ్యులు శాఖ కార్యదర్శులు సి హెచ్ నర్సిరెడ్డి జే సదానంద గౌడ్ పాండు సాబీర్ పుష్ప శాంతమ్మ కె వాణి శ్రీరాములు రేష్మ వెంకట్రావు కె నాగార్జునచారి అఖిల భారత యువజన సమైక్య ఎఐవైఎఫ్ నాయకులు రాణి, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నల్లాలకు అక్రమంగా బిగించిన మోటార్ల స్వాధీనం

హైదరాబాద్ మే 6 ప్రభాతవార్త నల్లాలకు అక్రమంగా మోటార్లు బిగించి నీటిని లాగేస్తున్న వారిపై జలమండలి విజిలెన్స్ అధికారులు కొరడా ఝుళిపించారు. బుధవారం ఉదయం 7:30 నుంచి 10:30 గంటల మధ్య కూకట్ పల్లి జోన్ పరిధిలోని ఓ అండ్ ఎం డివిజన్ 22, ధర్మారెడ్డి కాలనీ ఫేజ్1లో అధికారులు మెరుపు తనిఖీలు చేపట్టారు. నీటి సరఫరా జరుగుతున్న సమయంలో కాలనీలో పర్యటించి, పైపులైన్లకు నేరుగా బిగించిన 18 మోటార్లను స్వాధీనం చేసుకున్నారు. వినియోగదారులు నల్లాలకు మోటార్లు బిగించడం నిబంధనలకు విరుద్ధమని అధికారులు హెచ్చరించారు. ఇలాంటి చర్యల వల్ల ఇతర వినియోగదారులకు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. మొదటిసారి పట్టుబడితే మోటార్లను సీజ్ చేస్తామని, రెండోసారి కూడా అదే తప్పు పునరావృతమైతే రూ. 5,000 జరిమానా విధించడంతో పాటు కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. నీటి సరఫరాలో తక్కువ ఒత్తిడి (ప్రెజర్) ఉన్నా లేదా ఇతర సాంకేతిక ఇబ్బందులు తలెత్తినా చట్టవిరుద్ధంగా మోటార్లు వాడొద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారం కోసం సంబంధిత మేనేజర్, డీజీఎం లేదా జీఎం అధికారులను సంప్రదించాలని సూచించారు. అలాగే జలమండలి కస్టమర్ కేర్ నంబరు 155313 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని, తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరిస్తామని వెల్లడించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలతో ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పు : సిద్ధాంత్‌రెడ్డి

కరపత్రాలు పంపిణీ చేస్తున్న వంగ సిద్ధాంత్‌రెడ్డి

సైదాబాద్, మే 6 ప్రభాతవార్త: ప్రధాని నరేంద్రమోడి ముఖ్యఅతిథిగా హాజరుకానున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని చంపాపేట డివిజన్‌లో బిజెపి నాయకులు వంగ సిద్ధాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పాదయాత్ర చేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడి నేతృత్వంలో దేశం అభివృద్ధి పథంలో ముందంజలో ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పులు తీసుకుని వచ్చాయని అన్నారు. ఈ కార్యక్రమంలో చంపాపేట డివిజన్ బిజెపి అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, నాయకులు సద్ది సందీప్‌రెడ్డి, లింగాల దశరథ్‌గౌడ్, లంకల రమేష్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, మల్లేష్, క్రాంతినగర్ కాలనీవాసులు జనార్ధన్, బలరాంరెడ్డి, అమర్, బీరప్ప, సత్తయ్య పాల్గొన్నారు.

ప్రధాని మోడీ మహాసభకు భారీగా తరలిరావాలి : క్రాంతిగౌడ్

పార్కులో పాదచారులకు కరపత్రాలు పంచుతున్న బీజేపీ శ్రేణులు.

వనస్థలిపురం. మే.6.ప్రభాతవార్త ఈనెల 10న ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని డివిజన్ అధ్యక్షుడు కాటన్ క్రాంతి గౌడ్ ఆధ్వర్యంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.వనస్థలిపురం డివిజన్లో వివిధ పార్కులో వాకర్స్ కలిసి వారిని ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి అతిధులుగా జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి . మేడ్చల్ అర్బన్ జిల్లా ప్రభరి సామ రంగారెడ్డి . బిజెపి నాయకులు జక్కిడి ప్రభాకర్ రెడ్డి. కుంట్లూరు వెంకటేష్ గౌడ్ నూటి శ్రీనివాస్ , చిట్టిపోల్ రవికుమార్ , తడకమల విజయకుమార్, అరుణ్ జోగి , నరసింహారావు , రామాంజనేయులు గౌడ్ ,బద్దం రాంరెడ్డి గారు కుంచె అనిల్ కుమార్ గౌడ్ , అశోక్ కుమార్ , తదితరులు పాల్గొన్నారు

తెలంగాణ రజక కో-ఆపరేటివ్ కార్పొరేషన్ వైస్ చైర్మన్‌గా బంగారు బాబు

సిఎం రేవంత్‌రెడ్డితో బంగారు బాబు

సరూర్‌నగర్, మే 6 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర రజక కో-ఆపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్ వైస్ ఛైర్మన్‌గా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం నాదర్‌గుల్ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బంగారు బాబు నియమితులయ్యారు. రాష్ట్రంలో వివిధ కో-ఆపరేటివ్ కార్పొరేషన్లకు ప్రభుత్వం ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లను నియమించింది. ఈ నేపథ్యంలో వాషర్‌మన్ కో-ఆపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు ఛైర్మన్‌గా డాక్టర్ దాసరిరాజు అజయ్‌కుమార్ నియమితులు కాగా వైస్ ఛైర్మన్‌గా బంగారు బాబు నియమితులయ్యారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడైన బంగారు బాబు వైస్ ఛైర్మన్‌గా నియమితులు కావడం పట్ల పలువురు కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నేతలు హర్షం వ్యక్తం చేసి ఆయనను అభినందించారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం

తుర్కయంజాల్ మే6 ప్రభాతవార్త
దేశంలో పెరుగుతున్న గ్యాస్, పెట్రోల్, డీజీల్ ధరలకు వ్యతిరేకంగా సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ఒరుగంటి యాదయ్య సిపిఐ పార్టీ నాయకులతో కలిసి కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్పోరేట్ శక్తులకు లాభాలు కట్టపెట్టడం కోసమే ధరలు పెంచి ప్రజలపై బారాలు మోపుతోందని అన్నారు.2014లో పెట్రోల్ 62 రూపాయలు డీజిల్ 55 రూపాయలని వంట కేసు 250 300 ప్రస్తుతం 1000 దాటిందని అన్నారు. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర 1600 ఉండగా ప్రస్తుతం 3000 దాటింది అని అన్నారు. మోడీ యుద్ధాన్ని బూచిగా చూయించి ధరలు పెంచుతున్నారని అన్నారు. ప్రజలను దోచి కార్పొరేట్ శక్తుల ఖజానాలు నింపుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం యొక్క దిష్టిబొమ్మ ను దహనం చేసినారు. ఈ కార్యక్రమంలో కాటంరాజు,శివ ప్రసాద్, బ్రహ్మయ్య, రోజా,సైదమ్మా,అలివేలు, మణెమ్మ, పాల్గొన్నారు

నాగోల్ అభివృద్ధికి కృషి : చింతల


పరలోక పరిశీలిస్తున్న సురేందర్ యాదవ్

ఎల్.బి.నగర్, మే 6 ప్రభాతవార్త:
నాగోల్ డివిజన్ వెంకటరెడ్డినగర్‌కాలనీ నుండి వెంకటరమణకాలనీ వరకు నిర్మిస్తున్న స్ట్రాంవాటర్ డ్రైన్ పనులను బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్‌యాదవ్, జిహెచ్ఎంసి అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో కాలనీల్లో నీటినిల్వ సమస్యలను పూర్తిగా నివారించేందుకు ఈ డ్రైన్ పనులు అత్యంత కీలకమన్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పనులు నిర్వహించాలని కోరారు. నాగోల్ డివిజన్ అభివృద్ధి కోసం ఎప్పటికప్పుడు కృషి చేస్తామని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి లోపం లేకుండా ముందుకు సాగుతామన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు, బిజెపి నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

డిజిపి సివి ఆనంద్‌తో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బేటి

రాష్ట్ర నూతన డిజిపి సివి ఆనంద్‌ను కలిసి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

ఉప్పల్, మే 6 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర నూతన డిజిపిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన సి.వి.ఆనంద్‌తో బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బేటి అయ్యారు. ఈ మేరకు నగరంలోని డిజిపి ఆఫీసులో ఆయన మర్యాద పూర్వకంగా కలిసిన పలు అంశాలను వివరించారు. ముఖ్యంగా చర్లపల్లి డివిజన్‌లో రూ.కోటి 20 లక్షల నిధులతో చేపట్టబోయే స్టామ్ వాటర్ డ్రైనేజ్ పనులకు సంబంధించిన పరిపాలన పరమైన అనుమతులు ఇవ్వాలని, పనులు ప్రారంభించేందుకు జైల్ శాఖ డిజికి సూచించాలని కోరారు.ఈ పనులు పూర్తయితే స్థానిక ప్రాంతాల్లో వరద నీటి నిల్వ సమస్యలు తగ్గి, ప్రజలకు మెరుగైన మౌళిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. అదే విధంగా పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా, నిర్దిష్ట కాల వ్యవధిలో పనులు పూర్తి చేయడానికి సంబంధిత అధికారులకు సహకరించాలని జైళ్ల శాఖ అధికారులను ఆదేశించాలని కోరారు. ఉప్పల్ నియోజకవర్గంలో కొత్త పోలీస్‌స్టేషన్ల ఏర్పాటు, ఇతర అంశాలపై వివరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

చిన్న చెరువులో గుర్రపు డెక్క తొలగింపు పనులు

రామంతాపూర్ చిన్న చెరువులో గుర్రపు డెక్క తొలగింపు పనులు పరిశీలిస్తున్న బిఆర్ఎస్ నేత గంధం నాగేశ్వర్‌రావు తదితరులు

రామంతాపూర్, మే 6 ప్రభాతవార్త : రామంతాపూర్ చిన్న చెరువులో దోమల నివారణ, గుర్రపు డెక్క పనులను బుధవారం బిఆర్ఎస్ సీనియర్ నేత గంధం నాగేశ్వర్‌రావు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు ఎంటమాలజీ సిబ్బందితో కలిసి పనులు చేపట్టినట్లు తెలిపారు. దోమల నివారణ, గుర్రపు డెక్క తొలగింపు సమస్యలపై గుర్రపు డెక్క నీటి ఉపరితలాన్ని పూర్తిగా కప్పేయడం వల్ల సూర్యరశ్మి, ఆక్సిజన్ నీటిలోకి చేరవని, దీనివల్ల చేపలు, ఇతర జలచరాలు చనిపోతాయని తెలిపారు. గుర్రపు డెక్క వల్ల దోమలు, క్రిమి కీటకాలు విపరీతంగా పెరిగి మలేరియా, డెంగ్ వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని తెలిపారు. దోమల నివారణకు చెరువులో ఆయిల్ బాల్స్ వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సూరం శంకర్, చాంద్ పాషా, ఎంటమాలజి ఎఇ భారతి, సూపర్‌వైజర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పవన్‌కుమార్

ఎల్.బి.నగర్, మే 6 ప్రభాతవార్త: డివిజన్ పరిధిలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ వికాస్‌మహతోను కలిసి పలు సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. డివిజన్‌లో రోడ్ల దుస్థితిని వివరించి, కొత్త సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరినట్లు పవన్‌కుమార్ తెలిపారు. శ్రీరా మలింగేశ్వరకాలనీ, న్యూసమతాపురికాలనీలలో స్టార్మ్‌వాటర్, డ్రెయిన్ పనుల కారణంగా రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, పాదచారులు, వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. కొత్త సీసీ రోడ్ల నిర్మాణానికి తగిన నిధులు మంజూరు చేయాలన్నారు. మారుతీ నగర్ బుర్జు మైసమ్మ దేవాలయం, కొత్తపేట ఓల్డ్‌విలేజ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద రోడ్డు దెబ్బతిన్నాయని కొత్త రోడ్లు నిర్మించాలని కోరారు.

హెచ్‌ఎంటీనగర్‌లో రూ. 1.10 కోట్ల సిసి రోడ్డు పనులు

పనులను పరిశీలిస్తున్న నాయకులు

నాచారం, మే 6 ప్రభాతవార్త : నాచారం హెచ్‌ఎంటి నగర్ కాలనీలో నూతన సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులను బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ కాలనీ వెల్ఫేర్ సభ్యులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం హెచ్‌ఎంటి నగర్‌లో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ వినతి మేరకు రూ.1 కోటి 10 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. అలాగే హెచ్‌ఎంటి నగర్ కమాన్ నుంచి సిసిఎంబి క్వార్టర్స్ వరకు సీసీ రోడ్లు కూడా మంజూరు చేయించామని వెల్లడించారు. ఇంకా ఎక్కడైనా రోడ్లు మిగిలి ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వాటికి కూడా త్వరితగతిన నిధులు మంజూరు చేయించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి రామ్ కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు యాదగిరి రెడ్డి, ఎగ్జిక్యూటివ్ సభ్యులు బాల్ రెడ్డి, మక్బూల్, కట్ట బుచ్చన్న గౌడ్ పాల్గొన్నారు.

ఉప్పల్ బిజెపి మహిళా మోర్చ డివిజన్ కమిటి ఎన్నిక


బిజెపి మహిళా మోర్చ డివిజన్ కమిటి నేతలతో డివిజన్ అధ్యక్షుడు మార్నెని పణీందర్ తదితరులు

ఉప్పల్, మే 6 ప్రభాతవార్త : ఉప్పల్ బిజెపి డివిజన్ మహిళా మోర్చ కమిటిని బుధవారం ఎన్నుకున్నారు. బిజెపి డివిజన్ అధ్యక్షుడు మద్దెల పద్మ ఆధ్వర్యంలో కమిటిని ఎన్నుకుంటూ తీర్మానించారు. బిజెపి మహిళా మోర్చ ఉపాధ్యక్షురాలిగా కె.శారద, బి.జ్యోతి, గొరిగె కొమలత, కె.సౌమ్య, ప్రధాన కార్యదర్శులుగా విజయేత, గొరిగె నవత, కార్యదర్శులుగా బి.వీరప్రభ, జి.మాధవి, పూజ, సునీత, కోశాధికారి టి.శ్వేత, స్పోక్ పర్సన్ డి.రూప, మెంబర్‌గా జి.పుష్పలు ఎన్నికైనట్లు డివిజన్ అధ్యక్షురాలు మద్దెల పద్మ తెలిపారు. బిజెపి డివిజన్‌లో మహిళల అభ్యున్నతికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. తమకు పదవి వచ్చేందుకు కృషి చేసిన బిజెపి మహిళా మోర్చ అధ్యక్షురాలు డా.శిల్పారెడ్డి, అధ్యక్షుడు మార్నెని పణీందర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.